



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 28-04-2022 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 188 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## మే 2 నుంచి 'ఇంటింటికీ వైకాపా'

### ఎవరూ బహిరంగ విమర్శలు చేయొద్దు..

### పార్టీ బలోపేతానికి తీసుకోవల్సిన చర్యలపై సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

తాడేపల్లి (విజయభాను న్యూస్) : మంత్రులు, వైకాపా ప్రాంతీయ కో-ఆర్డినేటర్లు, పార్టీ జిల్లా అధ్యక్షులతో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ సమావేశం మగిసింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై సీఎం వారికి దిశానిర్దేశం చేశారు. పలుచోట్ల పార్టీలో అసమ్మతి స్వరాలు, వర్గ విభేదాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయం, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. విభేదాలు వీడి.. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మాజీ మంత్రులు, జిల్లా అధ్యక్షుల మధ్య సమన్వయంపై చర్చించారు.



మంత్రివర్గ విస్తరణ తర్వాత పార్టీలోని అసంతృప్త నేతలను సీఎం బుజ్జగించారు. విభేదాలు వీడి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీ ఆదేశాలు ధిక్కరించిన వారికి వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కవని హెచ్చరించారు. ఎవరూ బహిరంగ విమర్శలు చేయొద్దన్నారు. ప్రజాప్రతినిధులు వారి పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. త్వరలోనే జిల్లాల్లో పర్యటించనున్నట్లు ఈ సందర్భంగా సీఎం జగన్ తెలిపారు. మే 2 నుంచి 'ఇంటింటికీ వైకాపా' కార్యక్రమం నిర్వహించాలని సీఎం జగన్ నిర్ణయించారు. భేటీ అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించాలి. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మంత్రులు, పార్టీ నేతలు మరింత మెరుగ్గా స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరించడంపై దృష్టి పెట్టాలి. వచ్చే ఎన్నికల్లో పొత్తులపై ఈ సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదు. ఇకపై ప్రతి 3 నెలకు ఒకసారి మంత్రులు, పార్టీ అధ్యక్షులతో సీఎం సమావేశమవుతారు. జూలైలో ప్లీనరీ తర్వాత మరో సారి ఇలాంటి సమావేశం ఉంటుంది" అని సీఎం జగన్ నిర్దేశించినట్లు సజ్జల తెలిపారు.



## పెట్రోల్‌పై రాష్ట్రాలు పన్ను తగ్గించట్లేదు..

### ఇంధన ధరలపై తొలిసారి స్పందించిన మోదీ



దిల్లీ: దేశంలో పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారిగా స్పందించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై విమర్శలు గుప్పించారు. కేంద్రం ఇంధన ధరలపై సుంకాలు తగ్గించినప్పటికీ కొన్ని రాష్ట్రాలు మాత్రం పన్నులపై వెనక్కి తగ్గట్లేదని దుయ్యబట్టారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో ఇకనైనా ఆయా రాష్ట్రాలు ఇంధన ధరలపై పన్నులను తగ్గించాలని కోరారు.

దేశంలో గత కొన్ని రోజులుగా కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ నేడు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంధన ధరల అంశాన్ని ప్రస్తావించారు. "గతేడాది నవంబరులో ఇంధన ధరలపై కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. రాష్ట్రాలు కూడా పన్నులు తగ్గించాలని కోరాం. కానీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఝార్ఖండ్, తమిళనాడు రాష్ట్రాలు మా మాట వినలేదు. కారణమేదైనా పన్నులు తగ్గించలేదు. నేను ఎవర్నీ

తరువాయి 2లో..

## విదేశాలల్లో మన సంస్కృతికి మంచి పేరుంది

### నెల్లూరులో ఆకాశవాణి నూతన టవర్‌ను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు





నెల్లూరు : నగరంలోని ఆకాశవాణి రేడియో కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన 100 మీటర్ల టవర్‌ను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. గతంలో ఉన్న ఫ్రీక్వెన్సీ పరిధిని పెంచుతూ ఏర్పాటు చేసిన టవర్‌ను ఉపరాష్ట్రపతి జాతికి అంకితం చేశారు. అనంతరం ఆకాశవాణి స్టూడియోను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం లో వెంకయ్య మాట్లాడుతూ 100 మీటర్ల టవర్‌ను ప్రారంభించి నందుకు ఆనందంగా ఉందని.. ఈ కేంద్రం ఏర్పాటులో తాను కూడా భాగస్వాముడిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. విదేశాలల్లో మన సంస్కృతికి మంచి పేరుందని.. మన యాస, సంప్రదాయాలను ముందు తరాలకు అందించడం మన బాధ్యతన్నారు. ఇక్కడి యాస, భాషలను పరిశీలించి కార్యక్రమాలను చేపట్టాల్సిన బాధ్యత రేడియో కేంద్రం అధికారులపై ఉందని చెప్పారు. వరదల సమయంలో ఆకాశవాణి కేంద్రం అందించిన సేవలు అభినందనీయమని వెంకయ్యనాయుడు కొనియాడారు.

## విశాఖలో నిజం కాబోతున్న పేదల సొంతింటి కల

- నేడు సీఎం జగన్ చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ
- సీఎం జగన్ పాలనలో ప్రజలకు ప్రతిరోజూ పండగే
- ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే చర్యల వెనుక పచ్చ హస్తం
- తంజావూరు ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం
- రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ రికార్డ్ స్థాయిలో ఉత్పాదన
- ట్విట్టర్ వేదికగా ఎంపీ(రాజ్యసభ) విజయసాయిరెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖపట్నం/అనకాపల్లి జిల్లాలోని పేదల సొంతింటి కల నిజం కాబోతోందని. నగరంలో అర్హులైన 1.23 లక్షల మందికి సీఎం జగన్ నేడు (గురువారం) ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలపై స్పందించారు. నగరంలో భారీగా పెరిగిన భూముల ధరలను పరిగణనలోకి తీసుకుంటే పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల విలువ రూ.10 వేల కోట్లకు పైనే ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు ప్రతిరోజూ పండగేనని, ప్రతినెలా వివిధ రకాలైన ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. మే నెలలో జగనన్న విద్యాదీవెన, ఉచిత పంటల బీమా పథకం, వైఎస్సార్ రైతు భరోసా, మత్స్యకార భరోసా పథకాలు ప్రారంభించనున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే చర్యల వెనుక పచ్చ ముఠా హస్తం ఉందని, రూయా హాస్పిటల్ ఘటనలో బాబు హయాంలో విస్తరించిన ప్రైవేటు ఆంబులెన్సుల మాఫియా పాత్ర స్పష్టంగా

తరువాయి 2లో..

## విచారణకు రమ్మంటే రాలేదు..

### చంద్రబాబుపై చట్టపరంగా చర్యలు : వాసిరెడ్డి పద్మ



అమరావతి : తెదేపా అధినేత చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విచారణకు రానందున వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. ఈ విషయంపై న్యాయనిపుణులతో చర్చించి ముందుకెళ్తామని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బాధిత మహిళల పట్ల ఎలా వ్యవహరించాలో చెప్పేందుకే చంద్రబాబు, బొండా ఉమకు నోటీసులు ఇచ్చామని.. విచారణకు రాకపోవడంతో వారిపై చర్యలకు సిద్ధమవుతున్నామని వాసిరెడ్డి పద్మ తెలిపారు. విజయవాడ ప్రభుత్వ

ఆస్పత్రి వద్ద నైతిక విలువలు లేకుండా ప్రవర్తించారని.. అత్యాచార బాధితుల పట్ల ఎలా ఉండాలో చెప్పాలనుకున్నామన్నారు. మహిళా కమిషన్ కార్యాలయం వద్ద ధర్నాలు, ఆందోళనలకు సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు.




# సిబ్బంది పనితీరే శ్రీరామ రక్ష

**- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి ధర్మాన**



అమరావతి : అన్ని శాఖలకూ రెవెన్యూ శాఖ తల్లి వంటిదని, దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రాజధానిలో భూ పరిపాలన ప్రధాన సంచాలకుల కార్యాలయాన్ని ఏపీఐఐసీ భవనంలో ప్రారంభించి సంబంధిత సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. భవనాన్ని తమ శాఖకు అప్పగించినందుకు ఏపీఐఐసీకి కృతజ్ఞతలు చెబుతూ, విశాలమయిన భవనంలో సిబ్బంది బాగా పనిచేసి, మంచిపేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. తన నేతృత్వంలో కొత్త భవనం ప్రారంభం కావడం ఆనందంగా ఉందని, ఎక్కడైనా సిబ్బంది పనితీరే శ్రీ రామ రక్ష అని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై దృష్టి పెట్టండి

**- స్పీకర్ తమ్మినేని**



ఆమదాలవలస : పట్టణంలోని అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం ఆదేశించారు. బుధవారం ఉదయం ఐ జె నాయుడు కాలనీ వార్డులో గుడ్ మార్నింగ్ ఆమదాలవలస కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మట్ట సావిత్రి అనే ఒంటరి మహిళ పూరిపాకలో నివాసం ఉంటున్నానని వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నానని స్పీకర్ తమ్మినేని దృష్టికి సమస్య తీసుకురాగా హౌసింగ్ పథకంలో ఇల్లు కట్టించి ఇస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. కళ్యాణి రాజేశ్వరి అనే మహిళ పూర్వం నుండి టైలర్ వృత్తిని నమ్ముకొని బ్రతుకుతున్నానని ప్రభుత్వం అందిస్తున్న పదివేల రూపాయలు చేదోడు పథకం నాకు అందటం లేదని ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి పథకం వర్తించే విధంగా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా వీధిదీపాలు కరెంటు స్తంభాలు లేవని కొందరు మహిళలు స్పీకర్ దృష్టికి తీసుకురాగా ఎలక్ట్రికల్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో వేసిన సిసి రోడ్లు పాడయ్యాయని, అదేవిధంగా డ్రైనేజీ కాలువలతో కూడిన సిసి రోడ్లు వేయాలని కోరారు, అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పీకర్ ఆదేశించారు. కాలువలో ఉన్న పూడికలు తొలగించి అవుట్ లేట్ నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, బొడ్డేపల్లి అజంతా కుమారి, టౌన్ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాస రావు, పొన్నాడ చిన్నారావు, దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవి, పొదిలాపు తిరుపతి, స్థానిక నాయకులు బొడ్డేపల్లి రమణమూర్తి, మెట్ట ఈశ్వరమ్మ ,కనకరాజు వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యావిభాగంలో శ్రీకళకు వర్సిటీ డాక్టరేట్

**- ఉత్తర్వులు అందజేసి అభినందించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి**



ఆంధ్రవిశ్వవిద్యాలయం(విజయభాను న్యూస్): విద్యా విభాగం పరిశోధకురాలు మారిశెట్టి శ్రీకళకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు డి.నాగరాజ కుమారి పర్యవేక్షణలో ' తూర్పు గోదావరి జిల్లాలోని పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతన్న విద్యార్థులు అభ్యసన అలవాట్లకి పరీక్షల ఆందోళనకు మధ్య సంబంధం' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా శ్రీకళను విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు తదితరులు అభినందించారు. తనపరిశోధనలో భాగంగా 50 పాఠశాలల్లో రెండు వేల విద్యార్థులను అధ్యయనం చేశారు.

దీనిలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ఆందోళన స్థాయి అధికంగా ఉన్నట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యమస్థాయిలో ఉన్నట్లు, ఆదివాసీ ప్రాంతాల పిల్లల్లో ఆందోళన స్థాయిలు తక్కువగా ఉన్నట్లు పరిశోధనలో తేలింది. గ్రంధాలయాల వినియోగం అత్యల్పంగా ఉండటం, పాఠ్యపుస్తకాన్ని కూలంకషంగా అధ్యయనం చేయడం తగ్గిపోతోంది. ప్రైవేటు పాఠశాలల్లో ఇతర మెటీరియల్స్‌పై ఆధారపడటం జరుగుతోంది.





పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇస్తున్న ఇఫ్తార్ విందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



మొదటి పేజీ తరువాయి

# పెట్రోల్‌పై రాష్ట్రాలు పన్ను తగ్గించట్లేదు..

విమర్శించట్లేదు. కానీ, ఇకనైనా ఆయా రాష్ట్రాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో ఇంధన ధరలపై వ్యాట్‌ను తగ్గించాలని కోరుతున్నా" అని మోదీ తెలిపారు.

'నాలుగో వేవ్' భయాలపై మోదీ సూచనలు..

సమావేశంలో భాగంగా రాష్ట్రాల్లో కొవిడ్ పరిస్థితులపై ప్రధాని మోదీ సీఎంలతో చర్చించారు. గత రెండు వారాలుగా కొన్ని రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు పెరుగుతున్నందున మనమంతా అప్రమత్తంగా ఉండాలని మోదీ సూచించారు. కరోనా మహమ్మారి ముప్పు ఇంకా పూర్తిగా తొలగిపోలేదని, వైరస్ వ్యాప్తిని అరికట్టేలా మాస్కుల వినియోగం, భౌతిక దూరం వంటి నిబంధనలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. టెస్ట్, ట్రాకింగ్, ట్రీట్మెంట్ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని రాష్ట్రాలకు సూచించారు. కొత్త వేరియంట్లను ఎదుర్కొనేలా రాష్ట్రాలు అప్రమత్తం కావాలని ప్రధాని తెలిపారు. మెడికల్ కాలేజీలు, జిల్లా ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బందిని పెంచాలన్నారు. ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

అర్హులైన పిల్లలందరికీ వ్యాక్సినేషన్..

ఈ సందర్భంగా దేశంలో వ్యాక్సినేషన్ కార్యక్రమంపై మోదీ ప్రశంసలు కురిపించారు. దేశంలో 96 శాతం మంది వయోజనులకు కనీసం ఒక డోసు అందడం.. ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని కొనియాడారు. అర్హులైన ప్రతి చిన్నారికి వ్యాక్సినేషన్ అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యమన్నారు. మార్చి నుంచి 12-14 ఏళ్ల వారికి కూడా టీకాలు అందిస్తోన్న విషయాన్ని గుర్తు చేశారు.

6-12 ఏళ్ల వయసు చిన్నారులకు కూడా వ్యాక్సిన్ ఇచ్చేలా రెండు టీకాలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. పిల్లలకు టీకా పంపిణీపై తల్లిదండ్రులకు, చిన్నారులకు అవగాహన కల్పించాలని ప్రధాని రాష్ట్రాలకు సూచించారు.

## విశాఖలో నిజం కాబోతున్న పేదల సొంతింటి కల

కనిపిస్తోందని అన్నారు పిడుగురాళ్ల స్టేషన్ పరిధిలో స్కూలు పిల్లాడితో ఫ్లెక్సీలు చింపించి నేరం చేసేలా పచ్చ నేతలు ఉసిగొల్పడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో వచ్చే నెల 7, 8 తేదీల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్ మెగా జాబ్ మేళా జరగబోతోందని, ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంత్రులు, పార్టీ నేతలతో కలిసి బుధవారం ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తంజావూరు దేవాలయ రథోత్సవంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై 11 మంది ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. వైఎస్సార్ జిల్లాలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ 92% సామర్థ్యంతో ఉత్పాదన సాధించడం గర్వించదగ్గ విషయమని. కరెంటు లోటు సమయంలో శ్రమించిన ఇంజనీర్లు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. సీఎం జగన్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని అన్ని కేంద్రాల్లో ఉత్పాదన పెంచాలని కోరారు.

# రుయా తరహా ఘటనలు పునరావృతం కావొద్దు

**సీఎం వైఎస్ జగన్**





అమరావతి : రాష్ట్రంలో ఇకపై తిరుపతి రుయా తరహా ఘటనలు పునరావృతం కావొద్దని ఏపీ సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో అంబులెన్స్ డ్రైవర్లు మాఫియాలా తయారై.. ఓ అభాగ్యుడితో అమానవీయంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఘటనపై సీఎం జగన్ తీవ్రంగా స్పందించారు. ఆస్పత్రుల్లో ఫిర్యాదు నంబర్లు అందరికీ కనిపించేలా ఉండాలన్నారు. ఆరోగ్య మిత్ర కియోస్కుల వద్ద ఫిర్యాదు నంబర్లు కనిపించాలని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా బాధితులు ఫిర్యాదు చేసేలా ఉండాలని సూచించారు. ఒకట్రెండు ఘటనల వల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందని అభిప్రా యపడ్డారు. విజయవాడ ఆస్పత్రి లో జరిగిన ఘటన లాంటిది మరోసారి జరగకుండా చూడా లని అధికారులను ఆదేశించారు. పోలీసుల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అలసత్వం వహించారనే ఆరోపణలతో సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పోలీసు విభాగాలు సమర్థంగా పనిచేయాలని సీఎం సూచించారు.

తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అంబులెన్స్ డ్రైవర్లు మాఫియాలా తయారయ్యారు. కుమారుడు చనిపోయి పుట్టెడు దుఃఖంతో ఉన్న ఓ అభాగ్యుడితో అమానవీయంగా వ్యవహరించారు. వేలరూపాయల ఛార్జీ భరించలేనని మొత్తుకున్నా కనికరించలేదు. అతని యజమాని తక్కువ ధరకు అంబులెన్స్ మాట్లాడి పంపితే.. అడ్డుకున్నారు. చేసేది లేక కుమారుడి మృతదేహాన్ని భుజంపై వేసుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరాల్సి వచ్చింది. హృదయవిదారకమైన ఈ ఘటన రుయా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కొండూరు పంచాయతీ కేసీ ఎస్టీ కాలనీకి చెందిన కంభంపాటి నరసింహులు తన కుమారుడు జాషువా(10)ను కిడ్నీ సమస్య కారణంగా ఈ నెల 24న రుయా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఆసుపత్రి ప్రాంగణంలోని అంబులెన్స్‌లను విచారించారు. కొండూరుకు వెళ్లడానికి రూ. 20,000 అడిగారు. కూలి పని చేసుకుని బతికే అతడు అంత డబ్బులు ఇవ్వలేక ఈ విషయాన్ని తన యజమానికి ఫోన్ చేసి చెప్పి ఆవేదన చెందాడు. 110 కి.మీ. దూరానికి అంత డబ్బు ఎందుకన్న ఆయన.. ఆన్‌లైన్‌లో పరిశీలించి రూ. 5,000కు ఓ అంబులెన్స్ మాట్లాడి రుయా వద్దకు పంపించారు. అక్కడే ఉన్న అంబులెన్స్ మాఫియా ఆ వాహనాన్ని అడ్డుకుంది. డ్రైవర్‌ను బెదిరించింది. చేసేది లేక రాత్రి వేళ నరసింహులు కొడుకు మృతదేహాన్ని భుజాలపై వేసుకుని ఆసుపత్రి బయటికి వచ్చారు. అంబులెన్స్‌తో పాటే వచ్చిన దాని యజమాని తన ద్విచక్ర వాహనంపై ఎక్కమని కోరారు. సుమారు 12 కి.మీ. ప్రయాణించి అక్కడ తాము మాట్లాడుకున్న అంబులెన్స్‌లో ఎక్కించి మృతదేహాన్ని తన సొంత ఊరికి తీసుకెళ్లారు.

## రథోత్సవంలో అగ్నిప్రమాదం..

**11 మంది భక్తుల సజీవదహనం**

తంజావూరు : తమిళనాడు తంజావూరులో ఘోర ప్రమాదం జరిగింది. కరిమేడు అప్పర్ ఆలయ రథం ఊరేగింపులో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 11మంది భక్తులు సజీవదహనమయ్యారు. మృతుల్లో ఓ చిన్నారి ఉంది. మరో 15 మంది గాయపడ్డారు. రథోత్సవంలో పాల్గొన్న రథం గుడికి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. విద్యుదాఘాతం జరిగిన వెంటనే ఒక్కసారిగా మంటలు చెలరేగి రథం కాలి బూడిదైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.



## 'పది' పరీక్ష కేంద్రాల్లో

# మౌలిక వసతులను పరిశీలించిన ఎస్సీపీసీఆర్ సభ్యుడు సీతారాం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుండి ప్రారంభమై మే 9 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన మౌళిక వసతులు కల్పనపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ (ఎస్సీపీసీఆర్) సభ్యుడు గొండు సీతారాం విశాఖ నగరంలోని వివిధ పాఠశాలలను కలియదిరుగుతు పరిశీలించారు. దీనిలో భాగంగా చినవాల్తేరు కె. డి.పి.ఎం.మునిసిపల్ హైస్కూల్ కు చేరుకొని పరీక్షలు ప్రారంభానికి మునుపు విద్యార్థులు వారి తల్లిదండ్రులు నుండి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం అన్ని జిల్లాల్లో 3776 పరీక్షల కేంద్రాల్లో దాదాపు 6,22,537 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారని ఎస్సీపీసీఆర్ ఛైర్మెన్ కేసలి అప్పారావు సూచనలు మేరకు పరిశీలించి మౌలిక సదుపాయాలుపై నిశితంగా ఆరా తీస్తున్నామని అన్నారు.

విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ నేలపై కూర్చొని పరీక్షలు వ్రాయకుండా డెస్క్ లు సమకూర్చాలని త్రాగునీరు,తరగతి గదుల్లో సంపూర్ణ వెలుతురు, విద్యుత్ సదుపాయాలు,ఫ్యాన్లు,తదితర సదుపాయాలను కల్పిస్తూ టోల్ ఫ్రీ నంబర్లుతో హెల్ప్ లైన్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని,దివ్యాంగ విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖాధికారులుకు, సంభందిత జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు,అలాగే పరీక్షలకు హాజరయ్యే ముందు విద్యార్థులు,వారిని పరీక్ష కేంద్రాలకు వివిధ వాహనాలపై దింపే కుటుంబ సభ్యుల ద్విచక్ర,ఇతర మోటారు వాహనాలపై ఆంక్షలు విధించ వద్దని సూచించామని చెప్పారు,రద్దీ కూడళ్లలో ట్రాఫిక్ జామ్ లో చిక్కుకాకుండా ట్రాఫిక్ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సిందని ఆదేశాలు జారీచేసిన విషయాన్ని గుర్తు చేశారు,దూర ప్రాంతం నుండి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కు ప్రజా రవాణా సంస్థ విరివిగా బస్సులు నడపాలని ఆదేశాలు జారీచేసిన విషయాన్ని గుర్తు చేశారు,అలాగే ప్రతీ కేంద్రంలోను ప్రాథమిక ఆరోగ్య కిట్లు,మెడికల్,పారా మెడికల్ సిబ్బందిని నియమించేలా అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు నిర్దేశిత సూచనలు జారీచేసినట్టు చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా వ్రాసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఎక్కడైనా విద్యార్థులకు ఇబ్బందులు,బాలల హక్కులుకు విఘాతం కల్గినట్టు భావిస్తే తక్షణమే బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ దృష్టికి తీసుకొస్తే సంభందిత శాఖల అధికారులుకు ఆదేశాలు జారీ చేసి చర్యలు చేపట్టాల్సిందిగా సుచిస్తామని అన్నారు.

విద్యార్థులు వారి తల్లిదండ్రులుకు పూర్తి భరోసా కల్గించే విధంగా ఎస్సీపీసీఆర్ పెద్దన్న పాత్ర పోషిస్తుందని అన్నారు.

ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ పి.డి,సి.హెచ్ వి.వెంకట్రామిరెడ్డి,స్కూల్ ప్రధానోపాధ్యాయిని సుమతీ బాయి,సిబ్బంది ఉన్నారు.

## బాటసారులకు, విద్యార్థులకు, రాగి జావ పంపిణీ..




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : బాటసారులకు, విద్యార్థులకు, కార్మికులకు, కూలీలకు, ఆటో డ్రైవర్లకు.. పాత నగరంలోని వివేకా నంద సంస్థ రాగి జావ పంపిణీ చేసింది.. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా.. భానుడి భగభగల నుంచి వీరికి ఉపశమనం కలిగించేందుకు గత పది రోజులుగా రాగి జావ పంపిణీ చేస్తున్నారు. దీంతోపాటు ప్రముఖ సంఘ సేవకులు మట్టపల్లి హను మంతురావు ఆధ్వర్యంలో.. జగదాంబ సెంటర్లో.. మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నారు.ప్రతీరోజు 1000 మందికి మజ్జిగ అందజేస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## పరవాడ బాయ్స్ హస్టల్ లో

# ఘనంగా ఫేయిర్‌వెల్ డే



పరవాడ (విజయభాను న్యూస్) : మండల కేంద్ర మైన పరవాడ బాయ్స్ హస్టల్ లో మంగళవారం పేయిర్ వేల్ డే వేడుకులు అంగరంఘ వైభవంగా జరిగాయి. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ బిసి వేల్ఫేర్ అఫీసర్ కృష్ణారావు మరియు హస్టల్ వేల్ఫేర్ అపీసుర్ నవీనా హాజ రైన్నారు. విద్యార్డులు అట పాటలుతో సరదాగా గడిపారు. అనంతరము ఏర్పాటు చేసిన విందుబోజనాన్ని స్వీకరిం చారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్డులు విద్యారంగంలో ఉన్నత స్థాయికి ఎదుగాలానీ అకాక్షించారు. ఈ కార్య క్రమంలో విద్యార్థులు మరియు సిబ్బంది తథితర్లు పాల్గోన్నారు.



# గీతంలో సందడిగా "జి-బజార్"



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : ఎంబిఏ వంటి వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులలో వ్యాపార కాంక్షను పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ విభాగం ఆధ్వర్యలో బుధవారం తేది: 27-04-2022న ఏర్పాటు చేసిన "జి-బజార్" విద్యార్థుల సందడితో వాణిజ్య సముదాయాన్ని తలపించింది. ఎంబిఏ, బిబిఎమ్ వంటి కోర్సుల చదువుతున్న విద్యార్థులు స్వయంగా రూపొందించిన చేతి వృత్తులను, ఆకర్షణీయమైన పేయింటింగ్ లను, డిజైనర్లుగా మారి తయారు చేసిన వస్త్రాలను, ఇంటిలో తయారైన హోమ్ మేడ్ చాక్లేట్‌లతో పాటు పళ్ల రసాలు, వివిధ ఆహర పదార్థాలను జి-బజార్‌లో విక్రయానికి ఉంచారు. మరికొందరు విద్యార్థులు తాము రాసిన పుస్తకాలను అమ్మకానికి ఉంచారు. గీతం కేంపస్ లైఫ్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర హజరై ఈ జి-బజార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో వ్యాపారాత్మక ఆలోచనలను పెంచడానికి ఈ తరహ కార్య క్రమాలు ఉపయోగపడతాయన్నారు. స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.మంజుశ్రీ, డాక్టర్ ఇందుకూరి బంగారురాజు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా ఉక్కు ఎఐటియుసి అధ్యక్షులు

# సత్యనారాయణ కు సన్మానం



గాజువాక (విజయభాను న్యూస్) : ఉక్కు కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలలో టీడీపీ మిత్రపక్షాల మద్దతుతో గెలిచిన ఎ ఐ టి యు సి అధ్యక్షులు కె .సత్యనారాయణ ను ఉక్కు కర్మాగారం ఎస్ ఎం ఎస్ -1,బి ఎస్ వై విభాగం ఉద్యోగుల అద్వైర్యంలో శాలువ వేసి, పూలమాలలు వేసి , పుష్పగుచ్చాన్నిచ్చి ఘనంగా సన్మానించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాంట్ అభివృద్ధి ,కార్మిక సంక్షేమానికి కృషి చేస్తానని ముఖ్యంగా ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసి ప్లాంట్ ను రక్షించుకుంటామని అన్నారు. ఎ ఐ టి యు సి గెలుపు కు కృషి చేసిన ప్రతి కార్మికునికి కృతజ్ఞతలని అన్నారు.

పాశర్ల పైడి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో...

కార్మిక నాయకులు చీకటి శ్రీనివాసరావు ,మానం మహేష్ ,ఉప్పిల రామకృష్ణ ,నాగరాజు, గణపతి ,అప్పారావు ,సత్య నారాయణ ,కార్మికులు ,కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## అప్పన్న హుండీ లెక్కింపు

# 1 కోటి 61 లక్షల 92 వేల ఆదాయం





సింహాచలం, (విజయభాను న్యూస్) : శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారంనాడు ఆలయ ఈఓ వి.ఎం.వి.సూర్యకళ ఆధ్వర్యంలో చేపట్టారు.భక్తులు స్వామికి 27రోజులకు గాను నగదు రూపంలో 1కోటి 61 లక్షల 92 వేల 327 రూపాయలు సమర్పించ గా బంగారం 0.148.690 గ్రాములు వెండి 12 కేజీ ల 035గ్రాములు పలు దేశాలకు చెందిన కరెన్సీ భక్తులు సమర్పించారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు స్వచ్ఛంద సేవ సభ్యులు, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే కఠిన జైలు శిక్ష



భీమునిపట్నం : విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే కఠిన జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తారని కాబట్టి సత్ ప్రవర్తన తో మెలగాలని వారి తల్లి దండ్రుల ఆశయాల కనుగుణంగా మెలగాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ సుమిత్ గరుడ్ సూచించారు. సంగివలస ఎన్ అర్ ఐ మెడికల్ కాలేజీలో ఎం బి బి ఎస్ వైద్య విద్యార్డుల ను ఉద్దేశించి వారు ప్రసంగించారు తాను కూడా వైద్యుడినే నని విద్యార్థి గా ర్యాగింగ్ చవి చూసినట్టు ర్యాగింగ్ చాలా ప్రమాదకరమైన దని ర్యాగింగ్ కు వ్యతిరేకంగా ప్రభుత్వం ఎన్ ఎం సీ ఎన్నో చట్టాలను మార్గ దర్శ కాలను ప్రేవేశ పెట్టిందని ఈ సందర్భంగా ఎన్ అర్ ఐ మెడికల్ కాలేజీ ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ వారి చర్యలను అభినందించారు. ఏ సీ పీ వైజాగ్ నార్త్ చుక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల గురించి వాటి వలన కలిగే హని గురించి విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ హెచ్ ఎం ఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాదా మాదవ్ త్రిపాఠి ఎ ఎన్ హెచ్ సూపరెండెంట్ డాక్టర్ కృష్ణ మూర్తి శాస్త్రి ,డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీ కృష్ణా రెడ్డి మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కన్వీనర్ డాక్టర్ మల్లాది శర్మ పాల్గొన్నారు.

## కొయ్యూరు మండల పూర్వ ఏటిడబ్ల్యూఓ మృతి

కొయ్యూరు (విజయభాను న్యూస్) : కొయ్యూరు మండల పూర్వ ఏటిడబ్ల్యూఓ ఎన్.శ్రీనివాసరావు బుధవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతి చెందారు.

ఆయన మృతికి కొయ్యూరు మండల ఏటిడబ్ల్యూఓ జి.మంగవేణి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ యూనియన్ అద్యక్షుడు టి.మల్లేష్, వార్డెన్లు తిరుపతి, రమేష్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

# విజయభాను సంపాదకీయం

## నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీ

ఇప్పటి తరానికి- అంటే 2000 సంవత్సరం తర్వాత పుట్టినవాళ్లకు (పోస్ట్ మిలీనియం జనరేషన్‌కు) టెక్నాలజీ ప్రధాన సాధనం, ఆసక్తి. ఈ టెక్నాలజీ ఆధారిత పరికరాలతో పనిచేస్తుంటారు. ఆధునిక సౌకర్యాలు పొందుతుంటారు. ఇలా నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీతోనే వాళ్ల అనుబంధం పెనవేసుకుంటున్నది. ఏ ఫుడ్ ఏ హొటల్‌లో బాగుంటుందో ఆన్‌లైన్ రివ్యూలు చూసి తెప్పించుకుంటారు. ఎలాంటి బట్టలు కావాలన్నా, సినిమాలు చూడాలనుకున్నా, ప్రయాణాలు చేయాలనుకున్నా, డాక్టర్‌ను కలువాలనుకున్నా ప్రతిదానికీ ఆన్‌లైన్ మార్గమే పరిష్కారం. ఎలక్ట్రానిక్ టెక్నాలజీపైనే విస్తృతంగా ఆధారపడే 'ఇ- జనరేషన్' ఇది. మొబైల్ ఫోన్ ద్వారా కంఫర్ట్ జోన్‌ను ర్పరుచుకున్న తరం ఇతరత్రా కోల్పోతున్నదేమిటో అర్థం చేసుకోలేకపోతున్నది.

యువతరంలో కొందరు ఊహాలోకంలో విహరిస్తూ, సినిమాలు, రకరకాల మీడియాల ప్రభావాలకు లోనవుతూ ప్రేమ, పెండ్లి పేరిట జీవితాలను గందరగోళానికి గురిచేసుకుంటున్నారు. కాలేజీ చదువులప్పుడే తప్పనిసరిగా ప్రేమించాలి, లేకుంటే జీవితం వ్యర్థం అనుకుంటున్నారు. కొంతకాలానికే ప్రేమ విఫలమయిందంటూ ప్రాణాలు తీసుకుంటున్నారు. మరికొందరు ఎదుటివారిపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. కొన్నిసార్లు తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించడంలేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వార్తలు తరచూ మీడియాలో కనిపిస్తున్నాయి. తాజాగా.. పెద్దపల్లి జిల్లాలో ఓ యువకుడు తన ప్రియురాలు చనిపోయిందని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో తన ప్రేమను నిరాకరించిందంటూ ఓ ఇంటర్ అమ్మాయిని యువకుడు పొడిచి చంపాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో తల్లిదండ్రులు తమ పెండ్లికి అంగీకరించడం లేదంటూ యువతీయువకుల జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా అర్థాంతరంగా బతుకులను ముగించేస్తున్న ఘటనలు సమాజానికి ఆందోళనకరమైన పరిణామం. ఆధునిక శాస్త్ర సాంకేతికాభివృద్ధితో అద్భుత ప్రగతి సాధిస్తున్నట్టు ఒకవైపు భావిస్తుంటే, మరోవైపు మానవ జీవితంలో ఇలాంటి అపసవ్యతలు ఎందుకు సంభవిస్తున్నాయనేది విశ్లేషించుకోవాల్సిన అంశం.

ఈ తరానికి స్వతంత్రంగా ఉండాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. డామినేట్ చేస్తుంది. తమ కంఫర్ట్ జోన్‌కు ఇబ్బందికరమనుకుంటే ఎలాంటివారినైనా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదిరించాలనుకుంటారు. తల్లిదండ్రులతో ఎక్కువగా కలిసి ఉండాలనే ఆలోచన ఉండదు. అలాగే బంధుమిత్రులు.. వాళ్లతో అనుబంధాల విషయంలోనూ భిన్నంగానే ప్రవర్తిస్తుంటారు. ఇలా ఒకవైపు ఏకపక్షంగా జీవించే లక్షణాలుండేవారికి, మరోవైపు కొన్ని సమస్యాత్మక పరిస్థితుల్లో దృఢంగా, ఆత్మవిశ్వాసంతో నిలదొక్కుకునే ట్కస్థైర్యం లోపించడం విచిత్రకరంగా అనిపిస్తుంది. వీటికి కారణాలను అన్వేషిస్తే- పెరుగుతున్న పోటీ, అవాస్తవిక జీవిత లక్ష్యాలు, ఒంటరితనానికి లోనుకావడం వంటి అంశాలని భావించవచ్చు. జీవన నైపుణ్యాలను తగినంతగా అలవరుచుకోలేనప్పుడు సమస్యలు వారిని భయపెడతాయి. ఇతరుల నుంచి సరయిన సహాయ సహకారాలు పొందకుండా రకరకాల ఆలోచనలతో నిర్ణయాలకు వస్తుంటారు. ఇప్పటి ఆధునికత ఆత్మనిబ్బరాన్ని కలిగించలేకపోతున్నది. 'ఇ- జనరేషన్'కు ఇంగితం లోపిస్తున్నది. దానిని సరిదిద్దాల్సి ఉన్నది. టీనేజ్, యువతీయువకులకు విపరీత ఆలోచనలు రావడానికి కారణాలను అనేక రకాలుగా విశ్లేషించుకోవచ్చు. పరిణతి లేకపోవడం, ఎమోషనల్‌గా తొం దరపడటం అనిపించినప్పటికీ వాటికీ పరిష్కారాలను పరిశీలించాలి. ఇంటిలో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, స్నేహితులు, బయట ఇరుగుపొరుగు.. వీరందరితో అనుబంధాలు కూడా కీలక ప్రభావం చూపుతాయని గమనించాలి. అలా పెరిగేవారిలో తొందరపాటు ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవడం తక్కువ. పలు సందర్భాల్లో సమస్యలకు పరిష్కార మార్గాలను పరిశీలించే స్వభావం అలవడుతుంది. తీవ్ర నిర్ణయాలకు వచ్చేవారి లక్షణాలను గమనిస్తే- వాళ్ల ప్రవర్తనలో విపరీత ధోరణులుంటాయి. మాట్లాడటం, నిద్రపోవడం, తినడంలో తేడాలను గమనించాలి. ఇవన్నీ అయితే ఎక్కువగా ఉంటాయి లేదా అసలు ఉండవు. మానసికంగా కుంగుబాటులో ఉంటారు. ఏడుస్తుంటారు. బిగుసుకుపోతారు. చూపుల్లో, చేతల్లో అశాంతి కనిపిస్తుంది. స్తబ్ధుగా లేదా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు.

## సాధిఖానా రెండవ ఫ్లోర్ నిర్మాణం కొరకు సహకరించండి

### - ఎమ్మెల్సీ వంశీ కి వినతి పత్రం అందజేసిన తారా మసీద్ పెద్దలు



మద్దిలపాలెం (విజయభాను న్యూస్) : గ్రేటర్ విశాఖ 22 వార్డు పరిధిలో గల తారా మసీద్ వద్ద గల సాధిఖనా రెండవ ఫ్లోర్ నిర్మాణం కొరకు ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ నిధుల కొరకు వినతి పత్రాన్ని తారా మసీద్ పెద్దలు 22 వ వార్డు వైసిపి అధ్యక్షులు, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరక్టర్ పీతల గోవింద్ సమక్షంలో శివాజీ పాలెం నివాసంలో అందజేశారు.

అధిక సంఖ్యలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ప్రజలందరి అవసరాల కొరకు రెండవ ఫ్లోర్ నిర్మాణం చేపడుతున్నట్లు, ఎమ్మెల్సీ నిధులు ద్వారా నిర్మాణం చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి వర్యులు జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తూ, అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట వేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదని ఈ సందర్భంగా తెలిపారు . కార్యక్రమంలో తారా మసీద్ పెద్దలు రజాక్ ,ఎస్.కె మధిన్నిషా, ఎస్ కే ఎం వల్లీ బాబు, షేక్ షఫీ పాల్గొన్నారు.

## వాసిరెడ్డి పద్మ, వంగలపూడి అనిత మధ్య వాగ్వాదం



అమరావతి (విజయభాను న్యూస్) : మంగళగిరిలోని ఏపీ మహిళా కమిషన్ కార్యాలయాన్ని తెలుగు మహిళలు ముట్టడించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అప్పటికే వందల సంఖ్యలో మోహరించిన పోలీసులు తెలుగు మహిళలను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో కమిషన్ కార్యాలయం వద్ద తెలుగు మహిళలు నిరసనకు దిగారు. ఇందులో విజయవాడ అత్యాచార బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మహిళలపై జరిగిన దాడుల్లో ఎంతమందిపై చర్యలు తీసుకున్నారని అనిత ప్రశ్నించారు. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసే హక్కు తమకు ఉందని చెప్పారు. ఆస్పత్రిలో అత్యాచారం కేసులో తీసుకున్న చర్యలేంటని ఆమె ప్రశ్నించారు. తమను అనుమతించకపోతే మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మనే కిందకు రావాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. మహిళలపై నేరాలకు సంబంధించి వినతిపత్రం అందజేసి వెళ్లిపోతామని చెప్పారు. తర్వాత పరిమిత సంఖ్యలో మహిళలను కార్యాలయంలోకి అనుమతించారు. వాసిరెడ్డి పద్మకు వారు విజ్ఞాపన పత్రం అందజేశారు. విజయవాడతో సహా అన్ని అత్యాచార ఘటనల్లో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ క్రమంలో మహిళా కమిషన్ ఛాంబర్‌లో వాసిరెడ్డి పద్మ, వంగలపూడి అనిత మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అనంతరం "జగన్ పాలనలో ఊరికో ఉన్మాది" అనే పుస్తకాన్ని వాసిరెడ్డి పద్మకు అనిత అందించారు.

800కు పైగా జరిగిన అఘాయిత్యాల్లో ఎందరికి నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. పుస్తకాన్ని పరిశీలించి సమాధానం ఇస్తానని వాసిరెడ్డి పద్మ చెప్పారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో తనను దూషించారని తెదేపా అధినేత చంద్రబాబు, ఆ పార్టీ సీనియర్ నేత బొండా ఉమాకు వాసిరెడ్డి పద్మ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇవాళ వారు విచారణకు హాజరు కావాల్సి ఉంది. నోటీసులు ఇచ్చే అధికారం మహిళా కమిషన్‌కు లేదని తెదేపా స్పష్టం చేసింది.

మరోవైపు తాను విచారణకు వెళ్లడం లేదని బొండా ఉమా చెప్పారు.

## కవి సమయం

### జీవితం

వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ
ఆశావహ దృక్పథంతో సాగడం అవశ్యం
ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు
ప్రణాళికలు, కార్యాచరణ, పట్టుదల,
క్రమశిక్షణ, ముందుచూపు అత్యావశ్యకం
మనోభావాలలో చైతన్యం
ఆలోచనలలో నూతనత్వం
ప్రవర్తనలో దివ్యత్వం
సంబంధిత రీతిలో ఆదర్శవంతమైన
నూతన నిర్ణయాల రూపకల్పన
భిన్నత్వంలో ఏకత్వం
జాతీయ సమగ్రత, సర్వజీవ సమానత్వం
ఉల్లాస, ఆనందభరితమైన జీవితం
అందరి లక్ష్యం, గమ్యం, ఆశయం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : ఫాల్గుణ; తిథి :త్రయోదశి రా.12.49; ఉత్తరాభాద్ర సా.6.20; వర్జ్యము లేదు

గురువారం 28-04-2022

a **మేషం** : విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్తం ధనం బాగా ఖర్చు చేస్తారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసు కోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది. b **వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు. c **మిథునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిర చరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పు దారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదు రవుతుంది. d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండ టం శ్రేయస్కరం. e **సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగు తాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థునలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవ హారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి. f **కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టు కుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభ మవు తాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది. g **తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పుదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది. h **వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగ లవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది. i **ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకు తనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. j **మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవు తారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. k **కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. k **మీనం** :దైవ పుణ్య కార్య క్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి.

# పవిత్ర లింగాలు... పంచారామాలు..!






శివకేశవులకి భేదం లేదు. శివుడే విష్ణువు, విష్ణువే శివుడు. శివుడు ఎక్కడ ఉంటాడో విష్ణువు అక్కడే ఉంటాడు. విష్ణువు ఉన్నచోటే శివుడూ కొలువవుతాడు. శివకేశవుల్లోని ఆ ఏకత్వాన్ని తెలిపే పవిత్ర క్షేత్రాలే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెలసిన పంచారామాలు...

'శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే
శివస్య హ ృదయం విష్ణుర్విర్ణోశ్చ హృదయం శివః'... అంటే, శివుని రూపమే విష్ణువు. విష్ణువు రూపమే శివుడు. శివుడి గుండెల్లో కొలువ్కైనది విష్ణువే. విష్ణువు హ ృదయమే శివుడి ఆవాసం... అన్న అర్థాన్ని చాటే ఈ శ్లోకం యజుర్వేదంలోనిది. పంచారామాలుగా మనం పిలిచే ఆ ఐదు క్షేత్రాల్లోనూ కొలువున్నది శివుడే. క్షేత్రపాలకుడు విష్ణువు. పైగా ఆ శివలింగాలన్నీ ఒకే లింగం నుంచి ఉద్భవించినవే. తారకాసురుడు పరమశివభక్తుడు. తపస్సు చేసి శివుడి ప్రాణలింగాన్ని వరంగా పొందిన గర్వంతో దేవలోకంపైకి దండెత్తి, ఇంద్రుణ్ణి ఓడిస్తాడు. దాంతో దేవతలంతా తారకాసురుణ్ణి సంహరించమని ఆ శ్రీమహావిష్ణువుని కోరగా, ఆ శ్రీహరి 'తారకుడు శివభక్తుడు. శివుడి ప్రాణలింగాన్ని పొందినవాడు. నేను వధించలేను. శివుణ్నే ఆశ్రయించండి' అని చెప్పాడు. అప్పుడు దేవతలు శివుణ్ణి శరణు కోరగా 'నా ప్రియభక్తుడ్కైన తారకుణ్ణి నేను చంపలేను. మిమ్మల్నీ కాదనలేను. కుమారస్వామి వధిస్తాడు' అని చెబుతాడు. అంతట ఆ షణ్ముకుడు దేవసేనకు సారధ్యం వహించి తారకుడితో యుద్ధం చేశాడు. శక్తి ఆయుధంతో ఎన్నిసార్లు ఆ అసురుడి శరీరాన్ని ముక్కలుగా చేసినా మళ్లీ అతుక్కుపోతున్నాయి. ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్న కుమారస్వామికి శివుడు ప్రత్యక్షమై, 'కుమారా ఆందోళన చెందకు. తారకుడి కంఠంలో నా ప్రాణలింగం ఉన్నంతవరకూ అతను చనిపోడు. దాన్ని ముక్కలుచేయాలి' అని చెబుతాడు. అప్పుడు కుమారస్వామి ఆగ్నేయాస్త్రంతో ఆ లింగాన్ని ఐదు ముక్కలు చేయగా అవి క ృష్ణా, గోదావరీ తీరాల్లో పడ్డాయి. ఓంకార నాదంతో అవి మళ్లీ ఏకమవబోతుండగా విష్ణుమూర్తి ఆదేశం మేరకు పడ్డ చోటే ఆ లింగ శకలాలను దేవతలు వెంటనే ప్రతిష్ఠించి ఆలయాలు నిర్మించారన్నది పౌరాణిక కథనం. అవే ద్రాక్షారామం, అమరారామం, క్షీరారామం, సోమారామం, కుమారారామాలు.

క్షీరారామం! క్షీర రామలింగేశ్వర స్వామిగా పూజలందుకుంటోన్న ఈ క్షేత్రం పశ్చిమగోదావరిజిల్లాలోని పాలకొల్లులో ఉంది. పంచారామాల్లోని మిగిలిన నాలుగు క్షేత్రాల్లో లింగశకలాలను దేవతలు ఒకేసారి ప్రతిష్ఠించగా, క్షీరారామంలో మాత్రం త్రేతాయుగంలో రాముడు ప్రతిష్ఠించాడట. ఇక్కడి శివలింగం రెండున్నర అడుగుల ఎత్తులో తెల్లగా ఉంటుంది. అందుకే దీనికా పేరు. ఉత్తరాయణ, దక్షిణాయన ప్రారంభంలో ఉదయంవేళలో సూర్యకిరణాలు గోపురం రెండో అంతస్తు నుంచి లింగంమీద పడతాయి. గర్భగుడిలోని మూలవిరాట్టును నలువ్కెపులా ఉన్న కిటికీలనుంచి చూడవచ్చు. తొమ్మిదో శతాబ్దంనాటి చాళుక్యులే ఈ ఆలయాన్నీ కట్టించినట్లు చెబుతారు. 120 అడుగుల ఎత్తులో తొమ్మిది అంతస్తుల్లో నిర్మించిన గోపురం ఈ ఆలయ ప్రత్యేకత. ఆలయ క్షేత్రపాలకుడు జనార్థనుడు. ఇక్కడ ఒక్కరోజు ఉంటే ఏడాదిపాటు కాశీలో ఉన్న పుణ్యం దక్కుతుందట. సూర్యభగవానుడు, సప్తమాత ృక, పార్వతీదేవి, బ్రహ్మ, సరస్వతి, కనకదుర్గ, కాలభ్కైరవ, నటరాజు, దత్తాత్రేయ... ఇలా పలు దేవతలూ కొలువయ్యారిక్కడ. ఏలూరుకి సుమారు 110 కి.మీ.దూరంలో ఉందీ ఆలయం.

...సశేషం

## సంకీర్తన



# కేజీహెచ్ కు చైతన్య స్రవంతి ఫ్యాన్లు అందజేత



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సామాజిక సేవా కార్య క్రమాల్లో భాగంగా చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ వేసవికాలం దృష్ట్యా స్థానిక కింగ్ జార్జి ఆసు పత్రిలో చికిత్స పొందు తున్న రోగుల సౌకర్యార్థం బుధ వారం 300 ఫ్యాన్లను అందజేసింది. వీటి ఖరీదు సుమారు మూడు లక్షల రూపాయలకు పైగా ఉంటుంది. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు,వుడా మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్. ఏ. రహమాన్ ఈ ఫ్యాన్లకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలికి అందజేశారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సంస్థతో పాటు కొందరు దాతలు ముందుకొచ్చి సహకారం అందించడంతో ఆసుపత్రి అవసరాలు నిమిత్తం ఫ్యాన్లు కొనుగోలు చేసి అంద జేశామని చెప్పారు.ఇదివరలో తమ అభ్యర్థన మేరకు పోర్టు ట్రస్టు సుమారు పది లక్షల రూపాయలను కేజీహెచ్ లోని కార్డియాలజీ విభాగానికి ఎకోమిషన్ కొనుగోలుకు సమకూర్చిందని,వేదాంత కంపెనీ హోల్టర్ కొనుగోలుకు 5 లక్షల రూపాయలు అందజేసిందని చెప్పారు. ఆసుపత్రి నిర్వహణ ఖర్చులకు తమ సంస్థ ఇదివరలో లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తాము నిరంతరం సహకారం అందిస్తూనే ఉన్నామని షిరీన్ రహమాన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్రవంతి ప్రధాన కార్యదర్శి కె.అశోక్ కుమారి ఇతర ప్రతినిధులు విజయకుమారి, అనసూయ, రుకియాభాను తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది

- దశ దిశ లేని దిశ చట్టం ఎక్కడ
- దేశంలోని మహిళలపై దాడులలో ఏపీ మొదటి స్థానం
- చంద్రబాబు నాయుడు పై సమన్లు జారీ చేయడం తగునా
- మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి




అల్లూరి జిల్లా(పాడేరు)(విజయభాను) : వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా జాతీయ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు పాడేరు నియోజకవర్గం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో పాడేరు పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద మగలవారం తెలుగుదేశం పార్టీ మహిళలు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించాలని,అత్యాచార బాధిత కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉండాలన్నారు.రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు,అఘాయిత్యాలునిలువరించాలన్నారు.దుర్మార్గు లను కఠినంగా శిక్షించే విధంగా కఠిన చట్టాలు చేసి రాష్ట్రంలో ఆడబిడ్డలను కాపాడాలన్నారు. ఇటీవల విజయవాడలో ఆడబిడ్డపై జరిగిన అఘాయిత్యం పై దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.అదే విధంగా ఆ బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా అండగా ఉండాలని,మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టలేని మహిళా కమిషన్, తన వైఫల్యాలను దాచిపెడుతూ బాధితురాలిని పరామర్శించటానికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని,సమన్లు జారీ చేయడం ఏమిటన్నారు.వైసీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలతో పాటు మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తుదన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు మత్స్య రాష్ట్ర మణికుమారి, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్, రాష్ట్ర మహిళ కార్యదర్శి బొర్రా విజయ రాణి, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన సోమేలి చిట్టిబాబు, కార్యదర్శి అరకు పార్లమెంట్ మహిళా కార్యదర్శి గబ్బడి శాంతి కుమారి, అరకు పార్లమెంట్ ఎస్టీసెల్ మహిళా కార్యదర్శి డిప్పల, వెంకట కుమారి,రొబ్బి రాము, గోవింద్ మాస్టర్,లతో అధిక సంఖ్యలో మహిళలు నియోజకవర్గం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 96వ వార్డులో గీతం వైద్యశిబిరం



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం వైద్య కళాశాల ఆధ్వర్యలో స్థానిక 96వ వార్డు పరిధిలోని అంబేద్కర్ కాలనీలో బుధవారం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వ హించారు. పెందుర్తి మాజీ ఎమ్ఎల్ఏ బండారు సత్య నారాయణ, వార్డు కార్పొ రేటర్ పీలా శ్రీనివాస్ తది తరులు పాల్గొని వైద్య శిభిరాన్ని ప్రారం భించారు. గీతం వైద్య కళాశాల ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ వి.చరణ్, డాక్టర్ శ్రీకర్, డాక్టర్ ఎస్.హర్ష, డాక్టర్ విరేంధ్ర, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాధారణ వైద్య పరీక్షలతో పాటు కీళ్ళ సంబంధ వ్యాధులు, కంటి, దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దాదాపు 300 మంది స్థానికులకు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నట్లు కో ఆర్డినేటర్ కె.ముత్యాల నాయుడు తెలిపారు.

వైద్య సిబిరానికి స్థానికులు అవగడ్డ అప్పలనాయుడు, పి.రాంబాబు తదితరులు ఈ శిభిరానికి సహాయ సహకారాలు అందజేశారు.

# రోడ్లు మంచి నీరు అధిక ధరల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలి

## బాదుడే బాదుడు కార్యక్రమం లో డిమాండ్ చేసిన ముంచింగిపుట్టు మండల నాయకులు







అల్లూరిజిల్లా. (విజయ భాను), పాడేరు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అరకు నియోజకవర్గం ఇంచార్జి మాజీ మంత్రి వర్యులు కిడారి శ్రావణ్ కుమార్ ఆదేశాలతో ముంచింగిపుట్టు మండలం కించెయిపుట్టు పంచాయతీ లో బాడుడే బాదుడు కార్యక్రమం ద్వారా రాష్టంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు పాలనకు నిదర్శనమే ప్రజలపై అనేక రకాల ఆర్థిక బారాలను పెంచుతు ఎన్నో రకాల ఇబ్బందులకు గురి చేస్తూ బాబుడే బాదుడు అనే విదంగా నిత్యావసర ధరలు కానీ పెట్రోల్ డీజిల్ కానీ విద్యుత్ చార్జీలు గాని చెత్త పన్ను లాంటి దుర్మార్గపు పన్నులు వేసి ప్రజలకు ఎప్పుడు లేనంత బారాలను మోపుతూ ప్రజల రక్తాన్ని వాళ్ళ కష్టర్జితాని పిండుకొంటూ జగన్ మోహన్ రెడ్డి వైసీపీ ప్రభుత్వం దోచుకుంటుందిఇలాంటి ప్రభుత్వాన్ని రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే వస్తుందని టీడీపీ మండల నాయకులు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్ర టరీ పాంగి శాస్త్రిబాబు ముంచింగిపుట్టు మండల నాయకులు చేరంజీవి, శేసయ్య, ప్రసాద్, రాజారావు, కృష్ణ, ఆనంద్, దసరు సుబ్బారావు, సమాలోది రాంబాబు. తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రమాదంపై యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

విశాఖపట్నం : వహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ లో గల ఎస్ఎన్.ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలు జరిగిన ప్రమాదంపై విచారణ చేసి యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి శ్రీనివాసరావు బుధవారం పరవాడలో గోడ పత్రిక విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎన్ఆఫ్ ఇండియాలో జరిగిన ప్రమాదం పలు అను మానాలకు తావిస్తోందని విచారణ చేసి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఒకవైపు వెల్డింగ్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదం జరిగిందని కొంత మంది చెప్పగా మరోవైపు వేస్ట్ సాల్వెంట్ ట్యాంక్ పొందిందని కొందరు చెబుతున్నారని భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి ప్రమాదకరమైన పొగలు ఎగిసి పడ్డాయి. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఫైర్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ , సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ పరిశ్రమలు కార్మిక చట్టాలు ఎలా అమలు అవుతున్నాయి కాంట్రాక్ట్ కార్మికులు పర్మినెంట్ చేయడానికి ఏ ప్రాతిపదిక తీసుకుంటున్నారు. ఇటువంటి విషయాలపై లేబర్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని అన్నారు.

# మత్స్యకారుల ఉపాధికి గండికొడుతున్న ప్రభుత్వాలు

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : మత్స్యకారుల జీవనవిధానం రోజు రోజుకు అగమ్యగోచరంగా తయారైందని, ఇలాంటి సమయంలో మత్స్యకారులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని జాతీయ మత్స్యకారుల సమాఖ్య సమావేశంలో నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.భీమిలి జోన్ 3వ వార్డులో ఉన్న మత్స్యకారుల గ్రామం అయిన బోయవీధిలో గ్రామ పెద్దలు , మత్స్యకారుల సొసైటీ మరియు జాలారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ మత్స్యకారుల సమాఖ్య నాయకులు, ఇతర మత్స్యకారుల సంఘ నాయకులు హాజరై మాట్లాడారు. ముందుగా జాతీయ మత్స్యకారుల సమాఖ్య జనరల్ సెక్రటరీ ఓలేన్సియో సైమోస్ మాట్లాడుతూ సాంప్రదాయ మత్స్యకారుల జీవితాలు దిన దిన గండంలా తయార య్యాయని అన్నారు. రోజురోజుకు మత్స్య సంపద తగ్గిపోవడం, దొరికిన వాటికి సరైన గిట్టుబాటు ధర లేకపోవడం వలన మత్స్యకారుల జీవితాలు ప్రశ్నార్థకమైందని అన్నారు. ఒకపక్క తీరమంతా కలుషితమవడం, మరోపక్క దొరికిన మత్స్య సంపదకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడం మత్స్యకారులను కుదేలు చేస్తున్నాయని. అన్నారు. పిల్లలకు సరైన విద్య, వైద్యం అందించడానికి కూడా అవకాశం లేకుండా ఉన్నాయని, అన్నారు. మత్స్యకారుల సమాఖ్య నుండి కేంద్ర ప్రభుత్వ దృష్టిలో పెడతామని అన్నారు. అద్యక్షులు కె.లక్ష్మి మాట్లాడుతూ మత్స్యకారులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు వందకు వంద శాతం విఫలమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వాలు మత్స్యకారులకు వేట పరికరాలకు సంబంధించి సబ్సిడీ రుణాలు ఇచ్చేవని, వాటితో నూతన వేట సామాగ్రి తయారు చేసుకొని చాలావరకు లబ్ధి పొందేవారని అన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వ నియమావళిని యావత్ మత్స్యకారులు అందరూ గౌరవించి వేటకు వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటారని అన్నారు. రెండు నెలలు వేటకు వెళ్లకుండా ఉండేందుకు గాను ప్రభుత్వం మత్స్యకారుల భరోసా అంటూ ఒక్కొక్క కుటుంబానికి పదివేలు రూపాయలు ఇస్తుందని అన్నారు. రెండు మాసాలకు. పది వేలు అనేది మత్స్యకారుల కుటుంబాలకు సరిపోదని అయినా ప్రభుత్వ నియమావళిని గౌరవించి దానికే కట్టుబడి ఉంటారని. కానీ నేడు ప్రభుత్వం ఇస్తున్న మత్స్యకారుల భరోసాకు కూడా అనేక నిబంధనలు పెట్టి మత్స్యకారుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. మత్స్యకారుల మాజీ సొసైటీ అద్యక్షులు కాసరపు నర్సింగరావు మాట్లాడుతూ మరబోట్లు సంవత్సరానికి ప్రభుత్వ సబ్సిడీ డీజిల్ ను వెయ్యి లీటర్ల దాటి వాడాలని, ఇంజన్ బోట్లు 300 లీటర్ల కంటే ఎక్కువ వాడాలని, సాధారణ తెప్పలు 100 లీటర్లు దాటి వాడాలని, అంతకంటే తక్కువ డీజిల్ వాడితే వేటకు వెళ్లడం లేదని ప్రభుత్వ ముద్ర వేసి మత్స్యకారుల భరోసా ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికే అరకొర జీవితాలతో కుటుంబాలను కూడా పోషించు కోవడం కష్టంగా మారుతున్న సందర్భములో ఇన్ని నిబంధనలు పెడితే మత్స్యకారులు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలే ఈవిధంగా వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేవిధంగా ప్రయత్నం చేస్తే ఎలా అని అడిగారు. మత్స్యకారుల నాయకులు వాడమొదలు సత్యారావు మాట్లాడుతూ స్థానికంగా ఉండే దివిస్ కెమికల్ ప్యాక్టరీ వలన సముద్రంలో కలుషిత నీరు వదిలి మత్స్యకారుల జీబితాలు గందరగోళంలో తయారయ్యాయని అన్నారు. మత్స్యకారులు ఎంత డిమాండ్ చేస్తున్న యాజమాన్యంలో మార్పు రావడం లేదు, తక్షణమే వారు ఉపసంహరించుకోవాలని అన్నారు. సొసైటీ అద్యక్షులు వాడ మొదలు కృష్ణ మాట్లాడుతూ కరోనా కారణంగా మత్స్యకారుల జీవితాలు అల్లకల్లోలం అయ్యాయని, అన్నారు. ప్రభుత్వ ఆదాయం ఎక్కువగా వస్తున్న సంస్థల్లో మత్స్య పరిశ్రమ ఒకటని అన్నారు. ఇలాంటి పరిశ్రమకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు ఉన్నట్లయితే మత్స్యకారుల జీవితాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని లేని పక్షంలో మత్స్యకారుల జీవితాలు, జీవన విధానం, మత్స్య పరిశ్రమ కూడా గందరగోళంలో పడే అవకాశం ఉందని మత్స్యకారులు వాపోయారు. మత్స్యకారుల సమాఖ్య పెద్దలు మాట్లాడుతూ



సేవింగ్ కం రిలీఫ్ స్కీం రావడం లేదు. అదేవిధంగా సముద్రంలో మత్స్యకారులు చనిపోతే ప్రమాద బీమా రావడం బాగా లేటు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. మత్స్యకారులను దేశ వ్యాప్తంగా సంఘటితంగా చేయడం కోసం మత్స్యకారుల యాత్రను ప్రారంభించామని అన్నారు. మన సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకొని వెళ్ళి సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా చేస్తామని టి.కె.రెహమాన్ తెలియజేసారు.ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకారుల సమాఖ్య సభ్యులు పార్వతి, లియో కొలకో, పల స్వామి, సి.హెచ్.రాముతో పాటు గ్రామ పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, అరసవల్లి పోలిరాజు, చింతల ఎల్లయ్య, జాలారుల సంక్షేమ సంఘం అద్యక్షులు కొక్కిరి నూకరాజు, కాసరపు ఎల్లాజీ, కొక్కిరి అప్పన్న, ఇతర మత్స్యకారుల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 10వ రోజు రాగి జావా చలివేంద్రం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రోజుకి ఎండ లు పెరిగిపోతున్న దృష్ట్యా., శ్రీ స్వామి వివేకానంద సంస్థ వారు రాగి జావా చలి వేంద్రాన్ని నిర్వహించి 10 రోజులు పూర్తయ్యాయి. పోషక విలువలు కలిగిన రాగి జావ, బాటసారులకు ,కార్మికులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, ఆరోగ్యరీత్యా ఒంటికి ఎంతో మంచిది అని, అందుచేతనే ప్రతి సంవత్సరం కూడా వివేకానంద సంస్థ వారు ఈ రాగి జావా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతిరోజు జగదాంబ జంక్షన్ ప్రముఖ సంఘ సేవకులు మట్టపల్లి. హనుమంతరావు ఆధ్వర్యంలో 1000 మందికి మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించడం జరుగుతుంది .సంస్థ మహిళా సభ్యులందరూ ఈ రాగిజావ చలివేంద్రం నిర్వహించడం లో తమ సేవలను అందిస్తూ వస్తున్నారని, ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు అప్పారావు, సేవలందిస్తున్న వారం దరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ రాగి జావా చలివేంద్రం నిర్విరామంగా మూడు నెలల పాటు కొనసాగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం 29 రోజులకు రూ.1.33 కోట్లు



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్న వరం శ్రీ వీర వేంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపును కోవిడ్ నిబం ధనలు పాటిస్తూ బుధ వారం నిర్వహించారు.గడచిన 29 రోజులకు గాను సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం రూ.1,33,29,796/-(ఒక్క కోటి, ముప్పై మూడు లక్షల,ఇరవై తొమ్మిది వేల, ఏడువందల తొంభై ఆరు రూపాయలు) రాగా బంగారం 53 గ్రాములు, వెండి715 గ్రాములు లభ్యం కాగా విదేశీ కరెన్సీ యుయస్ఏ డాలర్లు 170,సింగపూర్ డాలర్లు 30 తో పాటు కొంత విదేశీ ద్రవ్యము లభ్య మయ్యాయి. ఈ హుండీల లెక్కింపు కార్య క్రమంలో దేవస్థానం కార్యనిర్వహ ణాధికారి వి.త్రినాధరావు,చైర్మెన్ ఐ.వి.రోహిత్, ఏసి రమేష్ బాబు,పిఆర్వో కొండలరావు మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది, వ్రత పురోహితులు, అర్చకులు,నాయీ బ్రాహ్మ ణులు తదితరులు పాల్గొన్నారు.

# సింహగిరిపై రెండో రోజు చందనం అరగదీత

**కొనసాగుతున్న హుండీల లెక్కింపు**



సింహచలం (విజయభాను న్యూస్) : సింహచలం శ్రీ వరహాలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రెండో రోజు బుధవారం కూడా చందనం అరగదీత కొనసాగుతోంది. మే 3న అప్పన్న నిజరూప దర్శనం రోజు రాత్రికి సహస్రఘట్టాభిషేకం అనంతరం తొలి విడత మూడు మనుగుల చందనాని) శాస్త్రోక్తంగా సమర్పించనున్నారు. ఇందుకు అవసరమైన చందనాన్ని సిబ్బంది ఆరగదీసి ఆలయ బండాగారంలో భద్రపర్చనున్నారు.



హుండీల లెక్కింపు...... ఇక బుధవారం సింహగిరిపై హుండీల లెక్కింపు ప్రారంభమైంది. చందనోత్సవం నేపథ్యంలో ముందుగానే ఆలయ సిబ్బంది హుండీలను తెరచి లెక్కిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్‌రాజు, సంపంగి శ్రీనివాసరావు, పాత్రుడు,దొడ్డి రమణ,చందు యాదవ్, శ్రీదేవి,శ్రీదేవి వర్మ,రాజేశ్వరి,రాధ తదితరు లంతా పాల్గొన్నారు.

**- చందనోత్సవం విజయంవంతం చేద్దాం**

మే3న జరగనున్న అప్పన్న నిజరూప దర్శనం ఉత్సవం విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సభ్యులంతా ఆలయ ఈవో ఎంవీ సూర్యకళ,సహాయ కమిషనర్ శాంతిలను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వీరంతా సింహాద్రినాథుని జ్ఞాపికను అందజేశారు.

## 10వ తరగతి పరీక్షలకు 99.45% హాజరు

**జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ**

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పదవ తరగతి ఎస్ఎస్సి పరీక్షలకు 99.45 శాతం మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. బుధవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలకు 57,458 మంది విద్యార్థులకు 57,144 మంది హాజరయ్యారని చెప్పారు. ఉమ్మడి విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 318 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు ప్రారంభమైనట్లు తెలిపారు.

# కుటుంబ కోసం నటించాం

- జీవితాలను పణంగ పెట్టాం
- కళాభిమానానికి సంతోషంగా ఉన్నాం
- ఆత్మీయ పురస్కారోత్సవంలో రంగస్థల మహా నటీమణులు
- ఆలపాటి లక్ష్మి
-కేవిజయలక్ష్మి
-దూసి అనురాధ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : కుటుంబ పోషణకు నాటకరంగం లోకి వచ్చి కష్ట నష్టాలను ఎదుర్కొని మహా నటి అంటూ కళారంగం ప్రేమ పొందడంతో అన్నీ బోసిపోయాయని రంగ స్థల మహిళా నట దిగ్గజాలు ఆలపాటి లక్ష్మి, కె. విజయ లక్ష్మి దూసి అనురాధలు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రంగసాయి నాటక గ్రంధాలయం ప్రాంగణంలో దేశంలోనే తొలి నాటక గ్రంధాలయం రంగసాయి నాటక గ్రంధాలయం 10వ వార్షికోత్సవం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి నేతృత్వంలో జరిగింది. ఇదే సందర్భంలో నాటక రంగ నట దిగ్గజాలుగా గౌరవం పొందుతోన్న ఆలపాటి లక్ష్మి, కె. విజయలక్ష్మి, దూసి అనురాధలకు ఆత్మీయ పురస్కారం లు అందజేశారు. ఈ సందర్భంగా ఆలపాటి లక్ష్మి మాట్లాడుతూ రంగస్థలం నుంచి సినీ పరిశ్రమకు వెళ్లడంతో దూరమైన అభిమానలోగిలి లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. నాటక గ్రంధాలయం స్థాపించిన బాదంగీర్ సాయి పేరు నాటకం ఉన్నంతకాలం నిలిచి ఉంటుందన్నారు. మరో ఆత్మీయ పురస్కార గ్రహీత నాటక దిగ్గజ మహా నటి కె. విజయలక్ష్మి మాట్లాడుతూ పొట్టకూటికోసం నటించానని., నటించడం కోసం ప్రాణం పెట్టానని అన్నారు. నాటకంలో బాగా నటించావని వచ్చే మెచ్చుకోళ్లు ప్రోత్సహిస్తే అవే కుంటుంబ పోషణకు జీవం అయ్యాయన్నారు. అభిమానంగ చెప్పే మాటలూ ప్రశంసలూ కొండంత ఆత్మీయత పంచుతున్నాయన్నారు. బాదంగీర్ సాయి ఆత్మీయ పురస్కారం బాగుందన్నారు. మరో పురస్కార గ్రహీత దూసి అనురాధ మాట్లాడుతూ ఆలపాటి లక్ష్మి కె విజయలక్ష్మి వంటి దిగ్గజాలతో పాటూ పురస్కారం పొందడం అదృష్టం అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్, కళారంగ ప్రోత్సాహకులూ సినీ నిర్మాత, నటుడు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ రంగస్థల ముగ్గురు దిగ్గజ నటీ మణులను సత్కరించటం కొత్త తరంకు స్ఫూర్తినివ్వడమేనని కొనియాడారు. విశాఖ కళారంగం ప్రతిభావంతుల వేదికనేందుకు ఆలపాటి లక్ష్మి, కె విజయలక్ష్మి దూసి అనురాధలు అద్దం అన్నారు. రంగ స్థల నట దర్శకుడు చలసాని కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఆత్మీయ పురస్కార గ్రహీతలు ముగ్గురు నటీమణులు తో తన అనుబంధాన్ని సభికులకు పంచారు. స్నేహాంజలి ఆర్ట్సు ఆకాడమీ వీఎన్ మూర్తి., రంగ స్థల నట దర్శకుడు రాజాం కృష్ణమూర్తి., సీనియర్ నటులు వర్రె నాంచారయ్య తదితరులు వేదికపై అతిథి ప్రసంగం చేశారు. అక్షర సారధి బీఎస్ చంద్రశేఖర్ సంధానకర్తగ వ్యవహరించిన కార్యక్రమంలో రంగసాయి నాటక గ్రంధాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి మాట్లాడుతూ పదేళ్ల క్రితం ప్రారంభించిన నాటక గ్రంధాలయం నిర్వహణ కష్టంగ ఉన్నప్పటికీ ఇందులో ఆనందం ఉందన్నారు. నాటక ప్రదర్శన లలోనూ అప్పులపాలైన అసంతృప్తిని మించి మంచి నాటక ప్రదర్శకునిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సత్కారం సైతం అందుకుని సంతుష్టి చెందానని తెలిపారు.

నాటకం., కళారంగంపై ఉన్న ప్రేమ ఆపేక్షలు ఊపిరిగ సాగుతూన్న తనకు అందరూ చేదోడుగ ఉండి నడిపిస్తున్నారని ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటాననీ బాదంగీర్ సాయి వెల్లడించారు.కార్యక్రమ నిర్వణలో నటీమణులు శివజ్యోతి, హేమ, జమ్మా చినబాబు, లతా తదితరులు భాగం అయ్యారు.

## రహదారి ప్రమాదం లో ఎగువశోభ సచివాలయ

# మహిళా పోలీసు ప్రధాని జయలక్ష్మి మృతి



అనంతగిరి (విజయభాను న్యూస్) : అనంతగిరి గ్రామానికి చెందిన మహిళ ఉద్యోగిని రోడ్ ప్రమాదంల నేడుమరణించారు.ఆమెకు భర్త,ఒక పాప ఉన్నారు. వివరాల్లోకి వెళితే అనంతగిరి మండలం ఎగువశోభ గ్రామ పంచాయతీ లో మహిళ పోలీస్ గా ప్రధాని విజయలక్ష్మి విధులు నిర్వహిస్తున్నారు. విజయలక్ష్మి ఎప్పటిలాగే విధులు ముగించుకొని తన స్వగ్రామమైన అనంతగిరి వస్తుండగా సాయంత్రం అనంతగిరి కాఫీతోటల ఘాట్ రోడ్ లొ ప్రమాదానికి గురై తీవ్రగాయాలు పాలయ్యారు.హుటాహుటిన అనంతగిరి హస్పటల్ లో చికిత్స అందిస్తుండగా ఆమె మృతి చెందారు.మృతురాలు విజయలక్ష్మికి భర్త సురేష్, పాప ఉన్నారు. ఈ రోడ్ ప్రమాదం పై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

బుధవారం సాయంత్రం అనంతగిరి బిసుపురం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎగువ శోభ సచివాలయం లో విధులు నిర్వహిస్తున్న ప్రధాని జయ లక్ష్మి ప్రమాద సంఘటన స్థలంలో మృతి చెందారు మరియు మృతి చెందిన జయలక్ష్మి కుమార్తె కు మరియు ఆటోలో ఉన్న ఒకరికి గాయాలు అయ్యాయి.



# సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్ల పాత్ర అభినందనీయం



ములగాడ :(విజయభాను న్యూస్ ):రాష్ట్ర ప్రభుత్వం పేద లకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్ల పాత్ర అభినందనీయం అని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. బుధవారం వార్డు పరిధి మల్కాపురం మరిడిమాంబ కళ్యాణ మండపం లో జరిగిన వాలంటీర్ల ప్రతిభా పురస్కారాల పంపిణీ వేడుకలలో. ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని వాలంటీర్లను ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారాలు అందజేసారు. ఈ సందర్భంగా కొణతాల సుధ మాట్లాడుతూ పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తూ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలలో ఒక్క రూపాయి కూడా అవినీతికి తావు లేకుండా అమలు చేస్తున్న ఘనత వాలంటీర్లకే దక్కుతుందన్నారు. నిరుపేదలకు తక్షణ సహాయం అందే విధంగా ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిటకు చేరే విధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయాలను స్థాపించి రోజుల వ్యవధిలోనే పలు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు నిజాయితీగా నిష్పక్షపాతంగా ప్రజలకు అందించే విధంగా నిరుద్యోగ యువతీ యువకులను భాగస్వామ్యం చేస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థను స్థాపించడం జరిగిందన్నారు. 2019 అక్టోబర్ రెండవ తేదీన గ్రామ సచివాలయ వ్యవస్థను స్థాపించి తద్వారా నాటి నుండి నేటి వరకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నామన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలు సైతం సచివాలయాల సేవలను చూసి ఆయా రాష్ట్రాలలో సచివాలయాలను స్థాపించే విధంగా ప్రయత్నం చేస్తున్నాయన్నారు. మరియు పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ మళ్ల విజయ్ ప్రసాద్ ఆశీస్సులతో వార్డులోని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డు, సచివాలయాల అడ్మిన్లు, ఇతర సిబ్బంది, వాలంటీర్లతో పాటు పారిశ్రామిక ప్రాంత ఇంచార్జి దాడి సత్యనారాయణ వార్డు అధ్యక్షులు వాసు వార్డు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశ్చిమ పట్టణ వాసులకు చేరువలో రిలయన్స్ 'ట్రెండ్స్'

విశాఖపట్నం : భారతదేశంలో అతి పెద్ద మరియు వేగంగా వృద్ధి చెందుతున్న అప్పారెల్ మరియు యాక్సరీస్ ప్రత్యేక చెయిన్ రిలయన్స్ 'ట్రెండ్స్' పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమడోలు పట్టణంలో తమ నూతన స్టోర్ ని ప్రారంభించింది. 8146 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఈ నూతన ట్రెండ్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో మంచి నాణ్యత మరియు ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉంది. అలాగే ఈ స్టోర్ భీమడోలు ప్రాంతపు వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా, అందుబాటైన ధరలో మరియు తాము చెల్లించిన ధరకు అత్యధిక విలువని కలిగి ఉంది. ఈ పట్టణానికి చెందిన కస్టమర్లు సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్ మరియు ఫ్యాషన్ యాక్సరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక మరియు గొప్ప షాపింగ్ అనుభవం కోసం ఎదురుచూడవచ్చు. ప్రత్యేకమైన ప్రారంభోత్సవపు ఆఫర్ కింద రూ. 3499 షాపింగ్ చేస్తే రూ. 199 కే ఉత్తేజభరితమైన బహుమతి పొందవచ్చు. అంతే కాదు రూ. 2999 కొనుగోలు పై వినియోగదారులు రూ. 3000 విలువ గల కూపన్లు పూర్తి ఉచితంగా పొందగలుగుతారు.కాబట్టి గొప్ప ఫ్యాషన్ షాపింగ్ అనుభవాన్ని ఆనందించడానికి ఇప్పుడే భీమడోలు ట్రెండ్స్ స్టోర్ కి వెళ్లండి.

## కాట్రేనికొన మండలం బీజేపీ పార్టీ శక్తి కేంద్రాల పర్యటన



కాట్రేనికొన : అమలాపురం పార్ల మెంటరీ కాట్రేనికొన మండలం లో శక్తి కేంద్రాల బూత్ కమిటీ పర్యవేక్షణ సమావేశం మండల ప్రధాన కార్యదర్శి మట్టా సూరిబాబు నివాసం వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క సమావేశానికి మండల ఇంచార్జ్ జిల్లా ఉపాధ్యక్షుడు గొలకోటి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ గారు పాల్గొన్నారు. పవన్ మాట్లడుతూ కేంద్ర ప్రభుత్వ%శ్% రైతులకు, వెనుకబడిన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ప్రతీ పథకాన్ని ప్రతీ ఇంటికి తిరిగి వివరించాలని అన్నారు, శక్తి కేంద్రాల ఇంచార్జ్ లకు భవిష్యత్ కార్యాచరణ విషయాలపై నల్లా పవన్ వివారించారు,మండలంలో ప్రతి గ్రామంలో బూత్ కమిటీ సభ్యులను అందరిని కలిసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

# పరామర్శకు వెళితే నోటీసులు ఇస్తారా

## నారా చంద్రబాబుకి ఇచ్చిన నోటీసుపై స్పందించిన టీడీపీ భీమిలి ఇంచార్జ్ కోరాడ రాజబాబు



భీమునిపట్నం(విజయభాను న్యూస్) : విజయవాడలో దివ్యాంగురాలైన మహిళపై జరిగిన అత్యాచారం విషయం తెలుసుకుని వెంటనే స్పందించి పరామర్శకు వెళ్లిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై దురుసుగా మాట్లాడటమే కాకుండా, లీగల్ నోటీసులు పంపించడం హేతుమైన చర్య అని భీమిలి నియోజకవర్గ ఇన్ చార్జ్, సెక్రటరీ కోరాడ రాజబాబు అన్నారు.స్థానిక టీడీపీ కార్యాలయంలో కోరాడ రాజ బాబు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వ హించారు. ఇటీవల రాష్ట్ర రాజధాని అమరా వతిలో పార్టీ అధినేత టీడీపీ సభ్యత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. భీమిలిలో సభ్యత్వ కార్యక్రమం కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. అందరూ సభ్యత్వం తీసుకొని టి డి పి అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేసి మన రాష్ట్ర అభివృద్ధికి సహకరించవలసినదిగా కోరాడ రాజబాబు పార్టీ శ్రేణు లకు. పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలసి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకి ఇచ్చిన నోటీసుపై స్పందించి భీమిలి చిన్న బజార్ జంక్షన్లో ఉన్న ఎన్.టి.ఆర్. విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అత్యాచారం జరిగి యావత్ రాష్ట్రమంతా నివ్వెరపోయిన పరిస్థితికి వస్తే రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఏమి చేస్తుందని కోరాడ రాజబాబు ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడు, ఈ విషయం తెలుసుకుని ఆడపడుచును పరామర్శకు వెళితే, వారిపై దురుసుగా మాట్లా డటమే కాకుండా నోటీసులు ఇస్తారా అని అడిగారు. మహిళలకు రక్షణ లేని ప్రభుత్వం దిగి పోవాలి అంటూ పెద్ద ఎత్తున మహిళలు నినాదాలు చేశారు. మహిళలకు రక్షణ కవచంలా ఉంటూ రాష్ట్రంలో ఉండే ప్రతీ మహిళకు ఉన్నతమైన స్థానం కల్పించిన వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అని, అలాంటి నాయకునిపై నోటీసులు ఇచ్చి మహిళా లోకం సిగ్గుపడేలా చేశారని కోరాడ రాజబాబు వ్యాఖ్యానించారు. మహిళా హోమ్ మినిష్టర్ కూడా వెంటనే స్పందించక పోవడం దారుణమని అన్నారు. ఇలాంటి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం యావత్ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.టి డి పి రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. చివరకు అన్నెంపుణ్యం ఎరుగని దివ్యాంగురాలైన మహిళపై కూడా అత్యాచారం జరగడం యావత్ రాష్ట్రం తలదించేకొనేలా చేసిందని అన్నారు. .

ఈ కార్యక్రమంలో జివిఎంసి 3వ వార్డు కార్పొరేటర్ గంటాగంటా అప్పలకొండ, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి డి.ఏ.ఎన్.రాజు యరబాల అనిల్ ప్రసాద్, పతివాడ రాంబాబు, తమ్మిన సూరిబాబు, బడికంతం నీలకంతం, పాసి నర్సింగరావు సీనియర్ నాయకులు పిట్టా సురేష్, కోరాడ రాంబాబు, నాయకులు కాసరపు నాగరాజు, , కాసరపు ఎల్లాజి, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, , వాసుపల్లి వంశీ, మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళపై దాడులను అరికట్టండి


## సంఘీభావ ర్యాలీలో మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్





అల్లూరిజిల్లా. (విజయభాను)డుంబ్రిగూడ మండల కేంద్రంలో రాష్ట్ర వైసిపి ప్రభుత్వ హయాంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా అరకు నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మహిళలు నాయకులు, కార్యకర్తలు కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగుతుందని నేరాలలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని వైసిపి ప్రభుత్వంలో మహిళల పై వేదింపులు,అత్యాచారాలు అధికంగా పెరిగిపోయాయని గతంలో ఎన్నడలేని విధంగా మహిళలపై దాడులు జరుగుతున్నాయని మహిళల ఆత్మ గౌరవన్ని భంగం కలిగించేల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని మహిళ పక్షపాతి అని చెప్పుకునే ప్రభుత్వం మహిళ మంత్రులు ఉన్నపటికీ కనీసం విజయవాడ లో జరిగిన సంఘటనకు కనీస స్పందన లేకపోవటం చాలా దుర్మార్గమని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలో రావటం ఖాయమని రాష్టంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలను తెలుగుదేశం పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు.

ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కోశదికారి వంతల నాగేశ్వరరావు,మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు,అరకులోయ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు,అరకు పార్లమెంట్ టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి మండ్యగురూ స్వామి,అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు,అరకు పార్లమెంట్ తెలుగు యువత జనరల్ సెక్రటరీ కొర్ర రవి కుమార్,మాజీ పిఏసిఎస్ డైరెక్టర్ కమిడి భాస్కరరావు,హుకుంపేట మాజీ జెడ్పీటీసీ సాగర సుబ్బారావు,హుకుంపేట మండల ఉపాధ్యక్షురాలు సూర్యకాంతం, అరకువేలి మండల ఉపాధ్యక్షురాలు ద్రౌపతి,అరకు పార్లమెంట్ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి కూడ వెంకటరావు, అరకు పార్లమెంట్ మహిళ జనరల్ సెక్రటరీ సాగర సత్యవతి,దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి,అండిభ సర్పంచ్ తమార్ల సత్యనారయణ,హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమ, పోతాంగి ఎంపీటీసీ మండ్యగురూ గీతా, గుంటగన్నెల మాజీ సర్పంచ్ గేన్ను, కంద్రుమ్ మాజీ సర్పంచ్ కొర్ర ఆనంద్, పోతాంగి మాజీ సర్పంచ్ గోల్లోరి భగత్రాం,సాగర మాజీ ఎంపీటీసీ లావణ్య,అరకు అసెంబ్లీ ఐటీడీపి కో కన్వీనర్ ఉబ్బెట్టి శివ సాగర్,టిఎన్ఎస్ఎఫ్ మండల నాయకులు నాగేంద్ర,మండల టీడిపి సీనియర్ నాయకులు కళావతి, వంతల కొండబాబు,గోల్లోరి ప్రసాద్,వంతల గురూ,కిలో ప్రసాద్,గుండన్న, రామరాజు,అర్జున్,సీతన్న,మహేష్, వంతల చంటి, అరకువేలి మండల నాయకులు మోస్య శ్యామ్,కళావతి,రమేష్, పెదబయలు మండల నాయకులు తాంగుల మహేష్,కర్జ అచ్చిబాబు, స్వామి,త్రినాథ్,మురళి,వెంకన్న, రామ మూర్తి,చేబ్రోలు నూకరత్నం,పాడి రుచి స్మిత,కొర్ర నీరజ, అస్తన్న ఆర్తి,మినోతి మహిళలు తదితరులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు సీఎం జగనన్న సభను జయప్రదం చేయండి



పరవాడ: నేడు సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం లో ఇండ్లు పట్టాలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న సిఎం జగన్ మొహన్ రెడ్డి సభకు మండలములో గల నాయకులు అందరూ పాల్గొనీ విజయవంతం చేయాలానీ మిండల వ్యవసాయ కమిటీ చైర్మన్ కోనరామారావు అన్నారు. బుధవారం అయన విజయభాను ప్రతినిథితో మాట్లడుతూ నేడు ఉదయం పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం మండలం పైడి వాడ అగ్రహారం గ్రామం (పెద ముషిడివాడ గ్రామ పంచాయితి బోర్డర్ దగ్గరలో)లో "పెందుర్తి శాసనసభ్యులు అన్నం రెడ్డి అదీప్ రాజ్ అధ్యక్షతన జరిగే భహిరంగ సభ లో ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమం నకు నాయకులు రైతు పక్ష పాతి అయిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై యస్ జగన్మోహన్ రెడ్డి విచ్చేస్తున్న కార్యక్రమానికి మండల వ్యవసాయ సలహ కమిటీ సభ్యులు గ్రామ వ్యవసాయ సలహ కమిటీ చైర్మన్లు సభ్యులు రావాడ గ్రామ పంచాయితీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వాలంటీర్లు అందరూ వచ్చి భహిరంగ సభ ను విజయవంతం చేయాలానీ అలాగే గ్రామం లో గల డ్వాక్రా మహి ళలు రైతులు అధిక సంఖ్య లో పాల్గొనీ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కోన రామారావు కోరారు.



**సాయి అన్నను కలిసిన పరవాడ జడ్పీటిసి పియస్ రాజు పరవాడఃఎంపి విజయసాయిరెడ్డిని బుధవారం పరవాడ జిల్లా ప్రాదేశిక సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరము దుశ్శాలువాతో సత్కరించారు. పరవాడ మండలములో గల ముఖ్యమైన సమస్యలను విజయసాయిరెడ్డికి వివరించారు.**

'హేట్ ఇన్ ఇండియా– మేక్ ఇన్ ఇండియా'

# మనుగడ అసాధ్యం..



దిల్లీ: దేశం నుంచి పలు అంతర్జాతీయ వాహన తయారీ సంస్థలు నిష్క్రమిస్తున్నాయని.. అందు కు కేంద్ర ప్రభుత్వ తీరే కారణమంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. దేశంలో హేట్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా ఒకేసారి మనుగడ సాగించలేవని విమర్శించారు. ఇటీవల కాలంలో పలు వాహన తయారీ సంస్థలు తమ ఉత్పత్తి కేంద్రాలను నిలిపివేయడంతో వేల మంది నిరుద్యోగులుగా మారుతున్నారని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. ఈ సందర్భంగా దేశంలో అత్యంత దారుణంగా మారుతోన్న నిరుద్యోగ సంక్షోభంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిపెట్టాలని సూచించారు. 'సులభతర డ్రైవింగ్ వ్యాపారం భారత్ నుంచి వెళ్లిపోతోంది. 7 అంతర్జాతీయ బ్రాండ్లు, 9 ఫ్యాక్టరీలు, 649 డీలర్‌షిప్‌లు, 84వేల ఉద్యోగాలు పోయాయ్. హేట్-ఇన్-ఇండియా, మేక్-ఇన్-ఇండియా రెండూ ఒకేసారి మనుగడ సాగించలేవు. వీటికి బదులుగా అత్యంత దారుణంగా మారుతోన్న నిరుద్యోగ సంక్షోభంపై దృష్టిపెట్టండి' అని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఏయే సంవత్సరంలో ఏయే కంపెనీలు భారత్ నుంచి నిష్క్రమించాయో తెలుపుతూ ఓ చార్ట్‌ను పోస్ట్ చేశారు. 2017లో షెవర్లే, 2018లో మ్యాన్ ట్రక్స్, 2019లో ఫియట్, యునైటెడ్ మోటార్స్, 2020లో హార్లీ డేవిడ్సన్, 2021లో ఫోర్డ్, 2022లో డట్సన్ వంటి

విదేశీ కంపెనీలు భారత్‌లో ఉత్పత్తిని నిలిపివేశాయని రాహుల్ గాంధీ గుర్తుచేశారు.

ఇంటింటా నిరుద్యోగం..

దేశంలో నెలకొన్న నిరుద్యోగంపై దృష్టి సారించడం లేదంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ మరోసారి మండిపడ్డారు. ముఖ్యంగా మోదీ ప్రభుత్వం ఇస్తోన్న మాస్టర్‌స్ట్రోక్‌లతో దేశంలో కోట్ల మంది నిరుద్యోగులు తమ ఆశలను కోల్పోవాల్సిన పరిస్థితి తలెత్తిందని దుయ్యబట్టారు. ఇంటింటా నిరుద్యోగమే ఇప్పటి నినాదమన్న ఆయన.. గత ఐదేళ్లలో రెండుకోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారంటూ మీడియాలో వచ్చిన కథనాలను ఉదహరిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

# బూస్టర్ తీసుకున్న 70శాతం మందికి కోవిడ్ దూరం..



థర్డ్‌వేవ్ ఫలితాలపై తాజా అధ్యయనం

దిల్లీ: కరోనా వ్యాక్సిన్ మూడో డోసు తీసుకోవడం వల్ల సమర్థవంతమైన ఫలితాలు వస్తున్నట్లు అంతర్జా తీయ అధ్యయనాలు వెల్లడిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌లోనూ బూస్టర్ డోసు (ప్రికాషనరీ) తీసుకున్న 70శాతం మంది మూడో వేవ్‌లో వైరస్ బారిన పడలేదని తాజా అధ్యయనం వెల్లడించింది. అంతేకాకుండా కొవాగ్జిన్, కొవిషీల్డ్ రెండు డోసుల ఫలితాలు ఒకే మాదిరిగా కనిపించినట్లు తెలిపింది. ప్రికాషనరీ డోసు పేరుతో కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న వ్యాక్సిన్ తీసుకున్న దాదాపు 6వేల మందిపై జరిపిన అధ్యయనంలో పలు విషయాలు వెల్లడయ్యాయి.

థర్డ్‌వేవ్ సమయంలో మూడో డోసు పనితీరుపై ఇండియన్ మెడికల్ ఆసోసియేషన్ ఏర్పాటు చేసిన నేషనల్ టాస్క్‌ఫోర్స్ అధ్యయనం చేపట్టింది. ఇందులో భాగంగా వ్యాక్సిన్ తీసుకున్న 5971 మందిని సర్వే చేసింది. వీరిలో 2383 మంది బూస్టర్ డోసు తీసుకోగా కేవలం 30శాతం మంది మాత్రమే మూడోవేవ్‌లో కరోనా బారినపడ్డారు. వీరిలో ఎక్కువగా ఆరోగ్య కార్యకర్తలే ఉన్నట్లు తాజా అధ్యయనం పేర్కొంది. రెండో డోసు తీసుకున్న సుదీర్ఘకాలం తర్వాత బూస్టర్ తీసుకున్న వారే మూడోవేవ్‌లో వైరస్ బారినపడినట్లు గుర్తించామని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ రాజీవ్ జయదేవన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఆరు నెలలకంటే ముందు బూస్టర్‌ను ఇవ్వడం వల్ల ఇన్‌ఫెక్షన్ రేటులో ఎటువంటి తేడా లేదన్నారు.

ఆ వయసువారిలోనే ఎక్కువ..

మూడోవేవ్‌లో అధికంగా 40ఏళ్ల వయసుకంటే తక్కువ ఉన్నవారే కరోనా బారినపడ్డారని తాజా అధ్యయనం పేర్కొంది. వారిలో 45శాతం మందికి మూడో వేవ్‌లో వైరస్ సోకినట్లు తెలిపింది. దాదాపు 39.6శాతం మంది 40 నుంచి 59ఏళ్ల వయసు వారుకాగా, వైరస్ బారినపడిన వారిలో 60 నుంచి 79ఏళ్ళ వయసు వారు 31.8శాతం ఉన్నారు. మరో 21.2 శాతం మాత్రమే 80ఏళ్లకు పైగా వయసున్న వారు ఉన్నట్లు తాజా అధ్యయనంలో అంచనా వేశారు. థర్డ్‌వేవ్‌లో వైరస్ బారినపడిన 2311 మందిలో కేవలం 4.8శాతం మందిలోనే లక్షణాలు కనిపించాయి. మరో 53శాతం మందికి స్వల్ప లక్షణాలు ఉండగా, 41.5శాతం మందిలో సాధారణ లక్షణాలున్నాయి. కేవలం 0.69శాతం బాధితులే తీవ్ర వ్యాధి బారిన పడినట్లు తాజా అధ్యయనం గుర్తించింది.

కొవాగ్జిన్, కొవిషీల్డ్ ఒకే మాదిరి..


దేశంలో గతేడాది డిసెంబర్‌లో మొదలైన మూడోవేవ్ ప్రభావం ఈఏడాది మార్చి వరకు కొనసాగింది. ఈ సమయంలో ఇన్‌ఫెక్షన్, ఆస్పత్రి చేరికలు, మరణాలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా జనవరి 10 నుంచి ఫ్రంట్‌లైన్ వర్కర్లతోపాటు 60ఏళ్ల వయసుపైబడిన వారికి ప్రికాషనరీ డోసు పేరుతో కేంద్ర ప్రభుత్వం మూడో డోసును అందజేసే కార్యక్రమం మొదలుపెట్టింది. ఇలా కొవాగ్జిన్, కొవిషీల్డ్ తీసుకున్న వారిలో థర్డ్‌వేవ్ సమయంలో ఇన్‌ఫెక్షన్ రేటు ఒకేవిధంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. సర్వేలో పాల్గొన్న వారిలో 5157 మంది కొవిషీల్డ్ తీసుకోగా వారిలో 2010 (39శాతం) మంది వైరస్ బారినపడ్డారు. మరో 523 మంది కొవాగ్జిన్ తీసుకోగా వారిలో 210 (40శాతం) మందికి వైరస్ సోకింది.

ఇదిలాఉంటే, సర్వేలో పాల్గొన్న సుమారు ఆరు వేల మందిలో 24శాతం మంది 40ఏళ్ల కంటే తక్కువ ఉన్నవారే. 50శాతం మంది 45 నుంచి 59ఏళ్ల వయసున్న వారు. సర్వే చేపట్టిన మొత్తం మందిలో 45శాతం మహిళలు ఉండగా.. అందులో 53శాతం ఆరోగ్యకార్యకర్తలు ఉన్నారు.

# యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా జాబ్ మేళాలు

- మే 7, 8 తేదీల్లో నాగార్జున వర్సిటీలో జాబ్‌మేళా
- ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు
- ప్రకాశం జిల్లాల యువత, ఉద్యోగార్థులకు అవకాశం
- భవిష్యత్తులో మరిన్ని జాబ్‌మేళా కార్యక్రమాలు
- కార్యక్రమంపై ప్రతిపక్షాల విమర్శ అర్థరహితం

\- ఎంపీ వి.విజయసాయిరెడ్డి






తాడేపల్లి(విజయభాను న్యూస్) : రాష్ట్రంలోని యువతకు వారి భవిష్యత్తుకు ఆసరాగా ఉద్యోగ కల్పనే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన లో వైకాపా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎంపీ విజయసాయి రెడ్డి పేర్కొన్నారు.

మే 7, 8 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించిన వి.విజయసాయిరెడ్డి పలువురు పార్టీ ముఖ్య నాయకులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ

**రెండు జాబ్‌మేళాలు సక్సెస్:**

ఈ జాబ్‌మేళాకు వచ్చే ఉద్యోగార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. పార్టీ అధ్యక్షులు, సీఎం శ్రీ వైయస్ జగన్ ఆదేశాల మేరకు ఇప్పటికే తిరుపతి, విశాఖపట్నంలో నిర్వహించిన జాబ్‌మేళాలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఇప్పుడు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మే 7, 8న మూడో జాబ్‌మేళా నిర్వహిస్తున్నాం. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

**లక్ష్యానికి మించి..:**

వాస్తవానికి ఈ కార్యక్రమం తలపెట్టినప్పుడు మూడు జాబ్‌మేళా (తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు)ల్లో మొత్తం 15 వేల ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అయితే తొలి రెండు కార్యక్రమాల్లోనే ఆ లక్ష్యాన్ని మించి, 30 వేలకు పైగా ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే జాబ్‌మేళా కూడా గ్రాండ్ సక్సెస్ అవుతుందని భావిస్తున్నాం. ఆ కార్యక్రమానికి 208 కంపెనీలు రిజిస్టర్ చేసుకున్నాయి.

**విపక్షాల విమర్శ అర్థరహితం:**

వైయస్సార్‌సీపీ జాబ్‌మేళాలను ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయి. జాబ్‌మేళాలో ఇస్తోంది సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలే అంటూ ఎద్దేవా చేస్తున్నాయి. కానీ వారి విమర్శలు అర్థరహితం. జాబ్‌మేళాల్లో ఉద్యోగాలు పొందిన వారి కనీస వేతనం రూ.15 వేలు కాగా, గరిష్ట వేతనం లక్షకు పైనే ఉంది. ఐటీ రంగంలోనూ అత్యధిక ఉద్యోగాలు లభిస్తున్నాయి.

**ఏయే జిల్లాల వారికి అవకాశం?:**

ఆచార్య నాగార్జున యూనివర్శటీలో నిర్వహించే బాజ్‌మేళాకు ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ జాబ్‌మేళాకు 77వేల మంది నిరుద్యోగులు రిజిస్టర్ చేసుకున్నారు. ఇక్కడ కూడా వీలైనంత ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని భావిస్తున్నాం.

**అదే సీఎంగారి లక్ష్యం:**

రాష్ట్రంలో ఏ ఒక్కరూ నిరుద్యోగిగా మిగలకూడదని అంత వరకు ఈ జాబ్ మేళా కార్యక్రమం కొనసాగించాలని సీఎం శ్రీ వైయస్ జగన్ ఆదేశించారు. విశాఖపట్నం, తిరుపతి జాబ్ మేళాలకు చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వచ్చారు. తమ పిల్లలకు ఉద్యోగాలు వచ్చినప్పుడు వారి ముఖాల్లో అంతులేని ఆనందం కనిపించింది.

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తే, ఆ కుటుంబ తలసరి ఆదాయం పెరుగుతుంది. తద్వారా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుతుంది. పారిశ్రామిక ఉత్పాదకత కూడా పెరుగుతుంది. ఇంకా ప్రత్యక్ష, పరోక్ష లాభాలు కూడా ఉంటాయి. రాబోయే రెండేళ్లలో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తాం. ప్రతి ఒక్కరి ముఖంలో ఆనందం వెల్లివిరియాలన్నదే సీఎం లక్ష్యంఅని విజయసాయిరెడ్డి వివరించారు.ఈ కార్యక్రమంలో

పార్టీ సీనియర్ నేత, మండలిలో ప్రభుత్వ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు,మంత్రులు అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, , ఎమ్మెల్యే శ్రీదేవి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డితో పాటు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గీతంలో మైక్రో కంట్రోలర్స్ గ్రంథ ఆవిష్కరణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

వైద్య రంగంలో మైక్రోకం ట్రోలర్‌ల ప్రయోజనాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇసిఇ విభాగం విశ్రాంత ఆచార్యుడు ప్రముఖ ఇంజనీరింగ్ పరిశోధకుడు డాక్టర్ పువ్వాడ రమేష్ రచించిన మైక్రోకంట్రోలర్స్ అండ్ ఇంటర్ ఫేసింగ్ (విత్ అప్లికేషన్స్ ఇన్ మెడిసిన్) గ్రంథాన్ని బుధవారం తేది: గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ ఆవిష్కరించారు. గీతంతో పాటు దేశంలోని ప్రముఖ విద్యా సంస్థలలో బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగాలలో పరిశోధనలకు డాక్టర్ పువ్వాడ రమేష్ విశేష కృషి చేసారని కొనియాడారు. అధ్యాపకులు నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలకు చేరవచ్చుననేది నిరూపించారని, ఆయన గ్రంథం విద్యార్థులకు, అధ్యాపకులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత డాక్టర్ పువ్వాడ రమేష్ మాట్లాడుతూ కంప్యూటర్‌లతో పాటు మొబైల్ ఫోన్లలలో మైక్రోకంట్రోలర్‌లు కీలకమని అలాగే వైద్య రంగంలో వాటి ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు. తన గ్రంథం ద్వారా మైక్రోకంట్రోల నిర్మాణం, హార్డ్‌వేర్ అంశాలతోపాటు ఈసిజి, ఎన్‌ఎమ్‌ఆర్‌ల వంటి వైద్య పరికరాలలో పెరుగుతున్న ప్రాధాన్యతను భవిష్య అవసరాలను, పరిశోధనకు అవకాశాలను తెలియజేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్ల వినియోగం మితిమిరితే జరిగే అనర్థాలను తన గ్రంథం ద్వారా వివరించినట్లు ఆయన తెలిపారు.

విధ్యుత్ అయిష్కాంత కాలుష్యం ద్వారా మొబైల్ ఫోన్లు వినియోగించేవారిలో వ్యాధినిరోధక శక్తి దెబ్బతినడం, హార్మోన్‌లలో మార్పులు రావడం, గందరగోళ పరిస్థితులు ఏర్పడటం జరుగుతోందని పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్ వాడకం ఎక్కువగా ఉన్నవారిలో ఒక్కోసారి తీవ్ర వత్తిడిలకు గురై ఆత్మ హత్యలకు దారి తీస్తున్నట్లు పలు పరిశోధనలలో వెల్లడైందని వీటిని తన గ్రంథంలో ప్రస్తావించినట్లు డాక్టర్ పువ్వాడ రమేష్ తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా గ్రంథ రచయిత డాక్టర్ పువ్వాడ రమేష్‌ను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, అకడమిక్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్‌వారియర్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ వైస్ ప్రిన్సిపాల్‌డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ సెవెన్తలైన్, డాక్టర్ జయశ్రీ తదితరులు సన్మానించారు.

## నంద్యాల జిల్లాలో పది ప్రశ్నపత్రం లీక్.. చిత్తూరు జిల్లాలో వదంతులు

నంద్యాల: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లెలో పది ప్రశ్నపత్రం లీక్ అయింది. వాట్సాప్‌లో ప్రశ్నపత్రం వెలుగుచూసింది. సూపర్‌వైజర్, ఇన్విజిలేటర్ పేపర్‌ను లీక్ చేసినట్లు సమాచారం. పేపర్ లీక్‌పై విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు చిత్తూరు జిల్లాలో పదో తరగతి ప్రశ్నపత్రం లీకైనట్లు వదంతులొచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. పశ్నపత్రం ఎక్కడ లీకైందో తమకు తెలియదని విద్యాశాఖ అధికారులు చెప్పారు. చిత్తూరు కలెక్టర్ హరినారాయణన్ దృష్టికి పేపర్ లీక్ విషయాన్ని తీసుకెళ్లారు. ఈ విషయంపై చిత్తూరు ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని డీఈవో పురుషోత్తం తెలిపారు. పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ వార్తలు నమ్మొద్దని చిత్తూరు కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. వదంతులు, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని.. చిత్తూరు జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఏపీలో ఇవాళ పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే.

## టీడీపీకి పాండు చేసిన సేవలను మరువలేం

- పాండు ఆశయాలను కొనసాగించాలి
- టీడీపీ మాజీ అధికార ప్రతినిధి సనపల పాండు వర్ధంతి సభలో శ్రీభరత్



మాధవధార (విజయభాను న్యూస్) : తెలుగుదేశం పార్టీ నగరంలో సీనియర్ నేతగా, అధికార ప్రతినిధిగా సేవలందించిన దివంగత నేత సనపల పాండురంగారావు సేవలో తెలుగుదేశం పార్టీ మరువ లేదని గీతం విద్యా సంస్థల అధినేత శ్రీ భరత్ పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, అధికార ప్రతినిధి సనపల పాండురంగారావు ప్రధమ వర్ధంతి సందర్భంగా జిల్లా తెలుగుదేశం నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా 50వ వార్డ్ మాధవధార ప్రధాన కూడలిలో మెడికల్ క్యాంప్ మెగా ఉచిత మెడికల్ క్యాంప్ మరియు బ్లడ్ డొనేషన్ క్యాంప్ ను తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, గీతం యూనివర్సిటీ చైర్మన్ శ్రీ భరత్, మరియు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ దూరపు రామారావులు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేశారు. స్వచ్ఛం దంగా వచ్చి మెడికల్ క్యాంపు లో సేవలందించిన వైద్య సిబ్బందికి శ్రీ భరత్ శాలువాలతో ఘనంగా సత్కారం చేశారు. పార్టీలకు అతీతంగా నిర్వ హించిన కార్యక్రమంలో పలు పార్టీల కు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు



మాట్లాడుతూ తెలుగుదేశ పార్టీ ఆవిర్భావం నుండి తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన పాండురంగారావు సేవలు మరువలేనివని ఆయన లేని లోటు పార్టీకి తీరని నష్టమని అన్నారు. కార్యక్రమాలో 50 వ వార్డు తెలుగుదేశం అధ్యక్షుడు సనపల వరప్రసాద్, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి పాసర్ల ప్రసాద్, ఉత్తర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విజయ్ బాబు, తో పాటుగా రాష్ట్ర నాయకులు లోడ గల కృష్ణ, పాండు రంగారావు కుటుంబ సభ్యులు, పూజారి ఉదయ్ కుమార్, సన పల స్వామి బాబు, సనపల నరసింహ స్వామి, సనపల గోవిందరాజులు, పైడి పుణ్యవతి, అరవింద్, చక్రి, ఎండా దాత్రి, సనపల రాము, సనపల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com